E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 02-07-2025 (వారం) బుధవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



సెటిల్‌మెంట్ అడ్డాలుగా పోలీసుస్టేషన్లు!
» 3లో

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు..

## నేషనల్ స్పోర్ట్స్ పాలసీకి గ్రీన్‌సిగ్నల్



ఈ కబురు,ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ భేటీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. జాతీయ క్రీడా విధానానికి కేంద్ర మంత్రి వర్గం పచ్చజెండా ఊపింది. దేశంలోని క్రీడా రంగాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించిన కేంద్రం.. కొత్త క్రీడా విధానానికి ఆమోదం తెలిపింది. ఉపాధి లింక్డ్ ప్రోత్సాహక పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపింది.

తరువాయి 2లో

# మృతుల కుటుంబాలకు

## రూ.కోటి ఆర్థిక సహాయం




ఈ కబురు, సంగారెడ్డి: హైదరాబాద్ శివారులోని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో పేలుడు ధాటికి మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం, కర్మాగారం యాజమాన్యం సమన్వయంతో రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, వారి పిల్లలను గురుకుల పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. ఈ మేరకు మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలతో కలిసి మంగళవారం పరిశ్రమలో పేలుడు జరిగిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. పేలుడుకు కారణాలపై సమీక్షించారు. కర్మాగారంలో పీరియాడికల్ తనిఖీలు చేస్తున్నారా అని ఫ్యాక్టరీస్ భద్రతా విభాగం అధికారులను ఆరాతీశారు. ఎవరి వైఫల్యంతో ఇంత పెద్ద ప్రమాదం జరిగిందో నివేదిక ఇవ్వాలన్నారు. ప్రతి 15 రోజులకోసారి డ్రయ్యర్లను ఎందుకు తనిఖీ చేయలేదని నిలదీశారు. తర్వాత కంపెనీ ఎదుట ఉన్న బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో సీఎం మాట్లాడుతూ...

**అత్యంత విషాదకరమైన దుర్ఘటన**

"ఇది అత్యంత విషాదకరమైన దుర్ఘటన. కర్మాగారంలో ప్రమాదం జరిగే సమయంలో 143 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు నిర్ధారణ జరిగింది. వారిలో 36 మంది ప్రాణాలు కోల్పోయారు. 58 మంది సురక్షితంగా ఉన్నారు.

తరువాయి 2లో

# సుప్రీంకోర్టు చరిత్రలో కొత్త అధ్యాయం..




ఈ కబురు, నేషనల్ బ్యూరో: సుప్రీంకోర్టు చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. న్యాయస్థానంలో తొలిసారిగా రిజర్వేషన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. కోర్టులోని సిబ్బంది నియామకాలు, పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను అమలు చేస్తున్నట్టు అధికారికంగా ప్రకటించింది. ఈ తరహా విధానాన్ని ఇంప్లిమెంటేషన్ చేయడం ఇదే తొలిసారి. సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. ఈ మేరకు గత నెల 24నే సుప్రీంకోర్టు సర్క్యులర్ జారీ చేసింది. దీని ప్రకారం.. జూన్ 23 నుంచే ఈ పాలసీ అమల్లోకి వచ్చింది. ఈ పాలసీ ప్రకారం కోర్టుల నియామకాలు, ప్రమోషన్ల ద్వారా భర్తీ చేసే పోస్టుల్లో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం రిజర్వేషన్ వర్తిస్తుంది.

తరువాయి 2లో

ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్.. అగ్రస్థానానికి చేరువలో స్మృతి మంధాన
» 6లో




అందుకే చాలా ఆఫర్స్ వదులుకున్నాను: సప్తమి గౌడ
» 5లో



## తెలంగాణ

రైతుకు.. కేసీఆర్ మరణశాసనం
» 3లో




## గోల్కొండ కోటపై కాషాయజెండా ఎగరాలి: రామచందర్‌రావు



ఈ కబురు, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపాకు అధికారమే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తానని భాజపా రాష్ట్ర నూతన సారథి ఎన్.రామచందర్‌రావు అన్నారు. విద్యార్థి దశ నుంచి అనేక పోరాటాలు చేశానన్నారు. ఇప్పటివరకు న్యాయవాదులు, విద్యార్థుల కోసం పోరాడానని, ఇకనుంచి తెలంగాణ ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తానని చెప్పారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా మన్నెగూడెంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నూతన అధ్యక్షుడిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు రిటర్నింగ్ అధికారిణిగా వ్యవహరించిన కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజే... ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి, కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఇప్పటివరకు అధ్యక్షుడిగా కొనసాగిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పార్టీ జెండాను రామచందర్‌రావుకు అందించి.. సారథ్య బాధ్యతలు అప్పగించారు.

తరువాయి 2లో



బీవీ పట్టాభిరామ్ కన్నుమూత
» 2లో

# మృత్యుపాశం!..

## 36కు పెరిగిన మరణాలు



ఈ కబురు, హైదరాబాద్, సంగారెడ్డి పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: మొన్నటి వరకు అదొక ఔషధ పరిశ్రమ. ఇప్పుడది శవాల దిబ్బ. శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ మృతదేహాలు బయటపడుతున్నాయి. కాలిపోయి బొగ్గుగా మారినవి కొన్నయితే... శిథిలాల మధ్య ఇరుక్కొని మాంసపు ముద్దలుగా మారినవి మరికొన్ని. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన పేలుడులో 19 మంది కార్మికులు మృతి చెందారని, ఐదుగురి ఆచూకీ తెలియడంలేదని అధికారులు తెలిపిన విషయం తెలిసిందే. కానీ, సహాయక సిబ్బంది మంగళవారం మరో 17 మృతదేహాలను వెలికితీశారు. దీంతో మృతుల సంఖ్య 36కు చేరింది. గాయపడిన 34 మంది నగర శివార్లలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మిగతా 60 మంది కార్మికుల ఆచూకీ లభించిందని, మరో 13 మంది ఆచూకీ తెలియడంలేదని అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 143 మంది పనిచేస్తున్నట్లు చెబుతున్నారు. భవనం శిథిలాలను పూర్తిగా తొలగిస్తేనే గల్లంతైన వారి వివరాలు లభిస్తాయి. మరోవైపు చనిపోయిన వారిని గుర్తించడానికి వారి బంధువులకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి గుర్తించే ప్రక్రియ చేపట్టారు.

తరువాయి 2లో



బిల్లు ఆమోదిస్తే.. రేపే కొత్త పార్టీ ఏర్పాటు చేస్తా: ఎలాన్ మస్క్
» 3లో

లాభాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు
» 4లో






## 'సంక్షేమ' విద్యార్థులకు హెల్త్‌కార్డులు

- విద్యార్థులకు కార్పొరేట్ ఆస్పత్రుల ద్వారా వైద్యం
- హాస్టళ్లను సందర్శించే క్యాలెండర్ రూపొందించండి
- సమీక్షలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

» 3లో

మొదటి పేజీ తరువాయి

# మృతుల కుటుంబాలకు రూ.కోటి ఆర్థిక సహాయం



ఈ కబురు, సంగారెడ్డి: హైదరాబాద్ శివారులోని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో పేలుడు ధాటికి మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం, కర్మాగారం యాజమాన్యం సమన్వయంతో రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, వారి పిల్లలను గురుకుల పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. ఈ మేరకు మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలతో కలిసి మంగళవారం పరిశ్రమలో పేలుడు జరిగిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. పేలుడుకు కారణాలపై సమీక్షించారు. కర్మాగారంలో పీరియాడికల్ తనిఖీలు చేస్తున్నారా అని ఫ్యాక్టరీస్ భద్రతా విభాగం అధికారులను ఆరాతీశారు. ఎవరి వైఫల్యంతో ఇంత పెద్ద ప్రమాదం జరిగిందో నివేదిక ఇవ్వాలన్నారు. ప్రతి 15 రోజులకోసారి డ్రయ్యర్లను ఎందుకు తనిఖీ చేయలేదని నిలదీశారు. తర్వాత కంపెనీ ఎదుట ఉన్న బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో సీఎం మాట్లాడుతూ...

**అత్యంత విషాదకరమైన దుర్ఘటన**

"ఇది అత్యంత విషాదకరమైన దుర్ఘటన. కర్మాగారంలో ప్రమాదం జరిగే సమయంలో 143 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు నిర్ధారణ జరిగింది. వారిలో 36 మంది ప్రాణాలు కోల్పోయారు. 58 మంది సురక్షితంగా ఉన్నారు. మరికొందరి ఆచూకీ కోసం సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. తీవ్రంగా గాయపడిన వారికి రూ.10 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.5 లక్షలు అందిస్తాం. తక్షణ సాయంగా మృతిచెందిన కుటుంబాలకు రూ.లక్ష, క్షతగాత్రులకు రూ.50 వేలు ఇవ్వాలని సంగారెడ్డి కలెక్టర్‌ను ఆదేశించాం. గాయపడిన కార్మికులకు నాణ్యమైన ఉచిత వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టాం. మృతదేహాలను వారి సొంతూళ్లకు తరలించేలా చూస్తాం. రెండు రోజుల నుంచి ఇద్దరు మంత్రులు, కలెక్టర్, ఎస్పీలతోపాటు ఇతర యంత్రాంగం కర్మాగారంలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, హైడ్రా, అగ్నిమాపక శాఖలతో సమన్వయం చేస్తున్నారు.

**ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక విధానం**

సిగాచీ పరిశ్రమలో ప్రమాదానికి కారణాలను కనుగొనేందుకు సీఎస్ ఆధ్వర్యంలో కమిటీ వేశాం. ఈ పరిశ్రమలో కాలానుగుణ (పీరియాడికల్) తనిఖీలు ఎలా జరిగాయో పరిశీలించాలని, తనిఖీలు జరిగితే లోపం ఎక్కడుందనేది తేల్చాలని సూచించా. వారిచ్చే నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. రసాయన, ఇతర పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని నిర్ణయించాం" అని వివరించారు. సమావేశంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్, కాంగ్రెస్ నాయకులు జగ్గారెడ్డి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

**సిగాచీ పరిశ్రమ ప్రతినిధులెక్కడ?**

"సిగాచీ పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులెక్కడ? సమీక్ష సమావేశానికి వారెందుకు హాజరు కాలేదు. ఇంత పెద్ద ప్రమాదం చోటుచేసుకుంటే... వారు వచ్చి బాధితులకు అండగా నిలవాలి కదా? ఇక్కడికి రాలేనంత బిజీగా ఉంటే పరిశ్రమను నిర్వహించడం ఎందుకు? మూసేయండి. మంత్రి శ్రీధర్‌బాబు జోక్యం చేసుకుని తక్షణమే వారిని పిలిపించాలి. సహాయక చర్యల్లో పాల్గొనేలా చూడాలి. మృతుల కుటుంబాలకు మానవతా దృక్పథంతో పరిహారం అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. క్షతగాత్రులకు సంస్థపరంగా లభించే సౌకర్యాలు కల్పించాలి" అంటూ కంపెనీ ప్రతినిధితో పాటు అధికారులను సీఎం ఆదేశించారు.

మొదటి పేజీ తరువాయి

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు..
## నేషనల్ స్పోర్ట్స్ పాలసీకి గ్రీన్‌సిగ్నల్



ఈ కబురు,ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ భేటీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. జాతీయ క్రీడా విధానానికి కేంద్ర మంత్రి వర్గం పచ్చ జెండా ఊపింది. దేశంలోని క్రీడా రంగాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించిన కేంద్రం.. కొత్త క్రీడా విధానానికి ఆమోదం తెలిపింది. ఉపాధి లింక్డ్ ప్రోత్సాహక పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఉత్పాదక రంగంలో ఉద్యోగకల్పన ప్రోత్సహించేందుకు కొత్త పథకం తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా రాబోయే రెండేళ్లలో 3.5 కోట్ల ఉద్యోగాల సృష్టికి ప్రోత్సాహకం ఇవ్వనుంది. ఈ పథకం కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 99,446 కోట్ల రూపాయలు ఖర్చు చేయనుంది. ఆగస్టు 1, 2025 నుంచి జూలై 31, 2027 వరకు సృష్టించే కొత్త ఉద్యోగాలకు ఈ పథకం వర్తిస్తుంది. కొత్తగా ఉద్యోగం కల్పిస్తే 15 వేల రూపాయల ప్రోత్సాహం ఇవ్వనుంది.ఈపీఎఫ్ రెండు వాయిదాలలో కేంద్ర ప్రభుత్వం చెల్లించనుంది. లక్ష రూపాయల లోపు జీతం వచ్చే ఉద్యోగులకు వర్తించనుంది. కొత్తగా ఉద్యోగం ఇచ్చిన కంపెనీలకు ప్రతినెల 3 వేల రూపాయల చొప్పున రెండు సంవత్సరాల పాటు ప్రభుత్వం చెల్లించనుంది. పరిశోధనాభివృద్ధి, ఆవిష్కరణ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ పథకం కోసం లక్ష కోట్ల రూపాయలు కేంద్రం ఖర్చు చేయనుంది. ఆర్అండ్‌డి రంగంలో ప్రైవేట్ రంగం పెట్టుబడులను ప్రోత్సహించడానికి తక్కువ లేదంటే.. 0 వడ్డీరేట్లతో దీర్ఘకాలిక ఫైనాన్స్‌న ప్రభుత్వం ఇవ్వనుంది. తమిళనాడు పారమాకుడిరామంతపురం సెక్షన్ మధ్య నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. 1,853 కోట్ల రూపాయలు కేంద్రం ఖర్చు చేయనుంది.

మొదటి పేజీ తరువాయి

# బీవీ పట్టాభిరామ్ కన్నుమూత



**ఈ కబురు, హైదరాబాద్: ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరామ్ (75) కన్నుమూశారు. హైదరాబాద్‌లో నిన్న (సోమవారం) రాత్రి ఆయన గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. రచయితగా, ఇంద్రజాలికుడు, మానసిక వైద్యుడిగానూ ఆయన పేరు ప్రఖ్యాతలు పొందారు. ఖైరతాబాద్ నివాసంలో పట్టాభిరామ్ పార్థివదేహాన్ని ఉంచారు. రేపు (బుధవారం) ఉదయం నుంచి అభిమానుల సందర్శనార్థం ఉంచనున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు జూబ్లీహిల్స్‌లోని మహా ప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు.ఆయన తెలుగుతో పాటు ఇంగ్లీషు, కన్నడ, తమిళ భాషల్లో కూడా రచనలు చేశారు. ఆయన విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించడంతో పాటు, తల్లిదండ్రుల అవగాహనా సదస్సులు కూడా నిర్వహించారు.**

**బీవీ పట్టాభిరామ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పీహెచ్‌డీ పట్టా పొందిన తరువాత సైకాలజీ, ఫిలాసఫీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్లలో స్నాతకోత్తర పట్టా అందుకున్నారు. ఇండియాలోనే కాకుండా.. అమెరికా, ఆస్ట్రేలియా, మలేషియా, థాయ్‌లాండ్, సింగపూర్, అరబ్ దేశాలలో అనేక వర్క్ షాపులు నిర్వహించారు.**

మొదటి పేజీ తరువాయి

# గోల్కొండ కోటపై కాషాయజెండా ఎగరాలి: రామచందర్‌రావు



ఈ కబురు, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపాకు అధికారమే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తానని భాజపా రాష్ట్ర నూతన సారథి ఎన్.రామచందర్‌రావు అన్నారు. విద్యార్థి దశ నుంచి అనేక పోరాటాలు చేశానన్నారు. ఇప్పటివరకు న్యాయవాదులు, విద్యార్థుల కోసం పోరాడానని, ఇకనుంచి తెలంగాణ ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తానని చెప్పారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా మన్నెగూడెంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నూతన అధ్యక్షుడిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు రిటర్నింగ్ అధికారిణిగా వ్యవహరించిన కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజే... ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి, కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఇప్పటివరకు అధ్యక్షుడిగా కొనసాగిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పార్టీ జెండాను రామచందర్‌రావుకు అందించి.. సారథ్య బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా రామచందర్‌రావు ప్రసంగించారు. "14 కోట్ల మంది సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ అయిన భాజపాలో తెలంగాణ రాష్ట్ర శాఖకు అధ్యక్షుడిగా ఎన్నిక కావడం గర్వంగా భావిస్తున్నా. అయినా సాధారణ కార్యకర్తగానే పనిచేస్తా. భాజపాలో కొత్త, పాత అనే తేడా ఉండదు. త్వరలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు పార్టీ అధికారంలోకి వచ్చేలా ప్రతి కార్యకర్తా కృషి చేయాలి. భారాస వాట్సప్ యూనివర్సిటీ, కాంగ్రెస్ ఫేక్ న్యూస్ యూనివర్సిటీలు నాపై ట్రోలింగ్ చేస్తున్నాయి. నేను సౌమ్యుడిని కాదు. 14 సార్లు జైలుకు వెళ్లాను. క్రిమినల్ లాయర్‌ను. ఎవరైనా తప్పుడు ప్రచారాలు చేస్తే కేసులు పెడతాం. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేస్తాం. పార్టీ ఈ స్థాయికి వచ్చిందంటే కార్యకర్తల త్యాగాలు, నాయకుల కృషి కారణం" అని రామచందర్‌రావు పేర్కొన్నారు.

కాంగ్రెస్, భారాసలు రాష్ట్రాన్ని దోచుకున్నాయి: కిషన్‌రెడ్డి

ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను గతంలో భారాస, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుని అప్పులపాలు చేశాయని... భాజపా అధికారంలోకి వస్తేనే అమరవీరుల ఆకాంక్షలు నెరవేరుతాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రామచందర్‌రావు సారథ్యంలో అంతా కలిసికట్టుగా పనిచేయాలని కార్యకర్తలకు, నేతలకు ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరున్నా.. పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని అన్నారు. కేసీఆర్, రాహుల్ గాంధీ కుటుంబాలు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వంటి నేతలు రాష్ట్రాన్ని దోచుకున్నారని... అన్ని రకాలుగా వెనక్కి నెట్టారని ఆరోపించారు. తెలంగాణకు గత పదకొండేళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా నిధులను కేంద్రం అందించిందని చెప్పారు. 40 రైల్వే స్టేషన్లతోపాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. దీనిపై రాష్ట్రంలో ఎక్కడైనా చర్చించేందుకు తాము సిద్ధమేనని భారాస, కాంగ్రెస్‌లకు కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు.

అధికారంలోకి వస్తే బీసీ సీఎం: బండి సంజయ్

భాజపా రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్, భారాసలకు లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. 'దేశానికి బీసీ ప్రధానిని చేసే దమ్ము కాంగ్రెస్‌కు ఉందా? భారాస అధ్యక్షుడిగా బీసీని ప్రకటించగలదా' అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో భాజపా అధికారంలోకి వస్తే కచ్చితంగా బీసీ ముఖ్యమంత్రిని చేస్తానని రాష్ట్రానికి వచ్చినప్పుడు ప్రధాని మోదీ హామీ ఇచ్చారన్నారు. కాంగ్రెస్, భారాస కుమ్మక్కయ్యాయని... అందుకే భారాస నేతలపై అనేక విచారణలు జరుగుతున్నా ఏ ఒక్క దాంట్లోనూ అరెస్టు చేయలేదని ఆరోపించారు.

# సుప్రీంకోర్టు చరిత్రలో కొత్త అధ్యాయం..



ఈ కబురు, నేషనల్ బ్యూరో: సుప్రీంకోర్టు చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. న్యాయస్థానంలో తొలిసారిగా రిజర్వేషన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. కోర్టులోని సిబ్బంది నియామకాలు, పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను అమలు చేస్తున్నట్టు అధికారికంగా ప్రకటించింది. ఈ తరహా విధానాన్ని ఇంప్లిమెంటేషన్ చేయడం ఇదే తొలిసారి. సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. ఈ మేరకు గత నెల 24నే సుప్రీంకోర్టు సర్క్యులర్ జారీ చేసింది. దీని ప్రకారం.. జూన్ 23 నుంచే ఈ పాలసీ అమల్లోకి వచ్చింది. ఈ పాలసీ ప్రకారం కోర్టుల నియామకాలు, ప్రమోషన్ల ద్వారా భర్తీ చేసే పోస్టుల్లో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం రిజర్వేషన్ వర్తిస్తుంది.అయితే ఈ రిజర్వేషన్లు పరిపాలనా, సహాయక సిబ్బంది స్థానాలకు మాత్రమే వర్తిస్తాయి. న్యాయమూర్తులకు ఇది వర్తించబోదని అత్యన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. కోర్టులోని రిజిస్ట్రార్, సీనియర్ పర్సనల్ అసిస్టెంట్, అసిస్టెంట్ లైబ్రేరియన్, జూనియర్ కోర్ట్ అసిస్టెంట్, జూనియర్ కోర్ట్ అటెండెంట్, చాంబర్ అటెండెంట్ సహా ఇతర పోస్టులకు వర్తించనుంది. ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని అమలు చేయడంలో సీజేఐ గవాయ్ కీలక పాత్ర పోషించినట్టు తెలుస్తోంది.

# మృత్యుపాశం!..36కు పెరిగిన మరణాలు

ఈ కబురు, హైదరాబాద్, సంగారెడ్డి పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: మొన్నటి వరకు అదొక ఔషధ పరిశ్రమ. ఇప్పుడది శవాల దిబ్బ. శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ మృతదేహాలు బయటపడుతున్నాయి. కాలిపోయి బొగ్గుగా మారినవి కొన్నయితే... శిథిలాల మధ్య ఇరుక్కొని మాంసపు ముద్దలుగా మారినవి మరికొన్ని. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన పేలుడులో 19 మంది కార్మికులు మృతి చెందారని, ఐదుగురి ఆచూకీ తెలియడంలేదని అధికారులు తెలిపిన విషయం తెలిసిందే. కానీ, సహాయక సిబ్బంది మంగళవారం మరో 17 మృతదేహాలను వెలికితీశారు. దీంతో మృతుల సంఖ్య 36కు చేరింది. గాయపడిన 34 మంది నగర శివార్లలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మిగతా 60 మంది కార్మికుల ఆచూకీ లభించిందని, మరో 13 మంది ఆచూకీ తెలియడంలేదని అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 143 మంది పనిచేస్తున్నట్లు చెబుతున్నారు. భవనం శిథిలాలను పూర్తిగా తొలగిస్తేనే గల్లంతైన వారి వివరాలు లభిస్తాయి. మరోవైపు చనిపోయిన వారిని గుర్తించడానికి వారి బంధువులకు డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించి గుర్తించే ప్రక్రియ చేపట్టారు.

**కనిపించని భవనం ఆనవాళ్లు**

పరిశ్రమ పూర్తిగా కుప్పకూలడంతో ఘటన జరిగిన 36 గంటల తర్వాత కూడా మొత్తం ఎందరు చనిపోయారన్న దానిపై స్పష్టత రాలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సోమవారం ఉదయం ఘటన జరిగిన వెంటనే తొలుత క్షతగాత్రులను, మంటల్లో చిక్కుకొన్న వారిని రక్షించేందుకు, మృతదేహాలను వెలికి తీసేందుకు ప్రాధాన్యమిచ్చిన సహాయక సిబ్బంది నెమ్మదిగా శిథిలాలను తొలగించడం ప్రారంభించారు. మంగళవారం ఉదయానికి పేలుడు జరిగిన ప్రాంతం వరకు జేసీబీలను వెళ్లగలిగేలా చేయగలిగారు. ప్రధాన ద్వారం నుంచి దాదాపు 50 మీటర్ల దూరంలో పరిశ్రమ భవనముంది. అందులోని ఎడమవైపు గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఔషధాన్ని శుద్ధి చేసే స్ప్రే యర్ డ్రయ్యర్ ఉంది. దానికి వెనుకవైపు ముడి పదార్థాన్ని పంపించే అల్యూమినియం పైపులు, ఎయిర్ హ్యాండిల్ యూనిట్లు ఉన్నాయి. సరిగ్గా డ్రయ్యర్ పై అంతస్తులో క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ ఎష్యూరెన్స్ విభాగాలున్నాయి. దానికి ఎడమవైపు గ్రౌండ్‌ఫ్లోర్, దాని పైఅంతస్తులో పరిపాలన, ఎకౌంట్స్ విభాగాలున్నాయి. డ్రయ్యర్ పేలుడు తీవ్రతకు శ్లాబ్ మొత్తం కుప్పకూలింది. అక్కడ ఒక అంతస్తు ఉండేదని చెప్పినా నమ్మలేని పరిస్థితి.

**లోనికి వెళ్లాలంటే భయం**

పేలుడు జరిగినప్పుడు డ్రయ్యర్ వద్ద సుమారు 50 మంది, దాని పైఅంతస్తులో 20 మంది వరకున్నారని ప్రాథమిక సమాచారం. పేలుడు తీవ్రతకు భవనమంతా కదిలిపోవడంతో గ్రౌండ్‌ఫ్లోర్‌లోని శిథిలాలను తొలగించి... లోనికి అడుగు పెట్టడానికి సహాయక సిబ్బంది జంకుతున్నారు. లోనికి వెళ్లగానే పైనున్న స్లాబ్ కూలిపోతుందన్న భయమే ఇందుకు కారణం. దాంతో మంగళవారం ఉదయం సహాయ చర్యలను నిలిపివేశారు. సాయంత్రం మళ్లీ మొదలైనా చురుకుగా సాగడంలేదు. ప్రత్యామ్నాయంగా భారీ యంత్రాలను తీసుకొచ్చి... శిథిలాలను తొలగించాలని అధికారులు ఆలోచిస్తున్నారు.

**50 మీటర్ల దూరం నుంచి ఎగిరిపడి... తన కారువద్దే..**

పేలుడు తీవ్రతకు 50 మీటర్ల దూరంలో ఉన్న భద్రతా సిబ్బంది కార్యాలయం కూడా కాలిపోయింది. దానిపక్కనే ప్రధాన ద్వారం వద్ద నిలిపిన సంస్థ జనరల్ మేనేజర్ ఇలంగోవన్ కారు ధ్వంసమైంది. ఆయన క్వాలిటీ కంట్రోల్ కార్యాలయం నుంచి మెట్లు దిగుతుండగా పేలుడు జరగడంతో... ఎగిరొచ్చి తన కారు వద్దే పడిపోయి ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో ఒక అగ్నిగోళం ఎగిరి వచ్చినట్లుగా కనిపించిందని చుట్టుపక్కల వారు తెలిపారు.

**ఐదుగురి పరిస్థితి విషమం**

ప్రమాదంలో గాయపడిన వారిలో తొమ్మిది మంది కార్మికులు పటాన్‌చెరులోని ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు రాజనర్సింహ, పొంగులేటి, వివేక్, శ్రీధర్‌బాబు పరామర్శించారు. వీరి వెంట డీజీపీ జితేందర్‌రెడ్డి, వైద్యారోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి క్రిస్టినాచోంగ్తూ ఉన్నారు. మరోవైపు పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి 36 మృతదేహాలను తరలించగా... ఉస్మానియా నుంచి వచ్చిన ఫోరెన్సిక్ బృందం వారు 30 మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. ఇక్కడ మృతదేహాలను నిల్వ ఉంచేందుకు ఫ్రీజర్లు, స్థలం లేకపోవడంతో పక్కనే కొత్తగా నిర్మించిన మల్టీ స్పెషాలిటీ భవనంలో వైద్యారోగ్య శాఖ పంపించిన ఫ్రీజర్లలో భద్రపరిచారు. మరో ఆరింటికి పోస్టుమార్టం జరగాల్సి ఉంది. 11 మంది మృతుల కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.11 లక్షలు, 34 మంది క్షతగాత్రులకు రూ.17 లక్షల నగదును ఆర్డీవో రవీందర్ అందించారు. కార్మికుల కుటుంబాలకు చెందిన యశ్వంత్ అనే వ్యక్తి బీడీఎల్ భానూరు ఠాణాలో ఫిర్యాదు చేయడంతో సిగాచీ పరిశ్రమ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు.



మొదటి పేజీ తరువాయి

# తెలంగాణ రైతుకు.. కేసీఆర్ మరణశాసనం




ఈ కబురు, హైదరాబాద్: కృష్ణా, గోదావరి జలాలను కేసీఆర్, హరీశ్‌రావులు ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టుపెట్టి.. తెలంగాణ రైతులకు మరణ శాసనం రాశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కృష్ణా బేసిన్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న 811 టీఎంసీలలో తెలంగాణకు 555 టీఎంసీలు రావాల్సి ఉండగా.. 299 టీఎంసీలు చాలని 2015లో వారిద్దరూ రాసిచ్చారన్నారు. గోదావరిలో 3,000 టీఎంసీల వరద నీరు సముద్రంలోకి వెళ్తోందని, ఈ నీటిని రాయలసీమకు మళ్లించుకోవచ్చని 2016లో ఎపెక్స్ కౌన్సిల్‌లో చెప్పారని, ఈ విషయాన్ని మినిట్స్‌లో స్పష్టంగా పేర్కొన్నారన్నారు. 2019లో గోదావరి నీటిని మళ్లించి రాయలసీమను రతనాల సీమగా చేయాలని కేసీఆర్ సూచించారని తెలిపారు. కృష్ణా, గోదావరి జలాలపై రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించకుండా కేంద్రం చోద్యం చూస్తోందని, తెలంగాణ హక్కులను కాలరాయడానికి 8 మంది ఎంపీలను భాజపాకు ఇవ్వలేదని విమర్శించారు. భారాసను బతికించడానికి కిషన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. కృష్ణా, గోదావరిలో తెలంగాణ హక్కులను రక్షించుకోవడానికి కేంద్రంపై నిరంతరం ఒత్తిడి తేవాలని, పోరాడాలని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు, శ్రేణులకు ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. అబద్ధాలతో నీటి సెంటిమెంట్‌ను రగల్చడానికి ప్రయత్నిస్తున్నారని, అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు వాస్తవాలు వివరించాలన్నారు. ఏపీ ప్రభుత్వం చేపట్టిన గోదావరిబనకచర్ల ప్రాజెక్టుపై మంగళవారం ప్రజాభవన్‌లో నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల ఛైర్మన్లకు అవగాహన కల్పించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

### వారి ధనదాహాన్ని తీర్చుకోవడానికే కాళేశ్వరం

''కేసీఆర్ ధనదాహాన్ని తీర్చుకోవడానికి ప్రాణహితచేవెళ్ల పేరు, ఊరు మార్చడంతో పాటు అంచనా పెంచి కాళేశ్వరం చేపట్టారు. రూ.1.50 లక్షల కోట్ల ఈ ప్రాజెక్టులో రూ.లక్షా రెండువేల కోట్ల విలువైన పనిచేసి రూ.96,000 కోట్లు చెల్లించారు. ఇంత ఖర్చు చేసి 50 వేల ఎకరాలకు మాత్రమే నీళ్లిచ్చారు. కృష్ణా, గోదావరి జలాలను ఏపీకి గతంలో తాకట్టు పెట్టిన కేసీఆర్, హరీశ్‌రావు.. ఆ రాచపుండునే ఇప్పుడు సమస్యగా సృష్టించాలని చూస్తున్నారు. భారాస పునరుజ్జీవానికి నీటి సెంటిమెంట్‌ను వాడుకోవడానికి చూస్తున్నారు. ప్రత్యేక అసెంబ్లీ ఏర్పాటుచేసి ఒకరోజు కృష్ణాపై, మరోరోజు గోదావరిపై చర్చిద్దాం రమ్మంటే భారాస ముందుకు రాలేదు. ఆపార్టీ నేతలది వ్యూహాత్మక రాజకీయ ఎత్తుగడ. నదీ జలాలను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లి దోషులుగా నిలబెట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తోంది. ప్రధాని మోదీ ప్రభుత్వ మనుగడ చంద్రబాబుపై ఉంది. చంద్రబాబు ప్రభుత్వ మనుగడ గోదావరి ప్రాజెక్టులపై ఉంది. ఈ లెక్కలన్నీ ఒక్క రోజులోనో, ఒక ఏడాదిలోనో తేలేవి కావు. ఇవన్నీ ప్రజలకు వివరించాలి. బనకచర్లపై నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌కు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్, చిత్రంలో కొండా సురేఖ, జూపల్లి, వాకిటి శ్రీహరి, పొంగులేటి, పొన్నం, మహేశ్‌కుమార్‌గౌడ్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, వివేక్, శ్రీధర్‌బాబు, చిన్నారెడ్డి తదితరులు

### భాజపా సహాయ నిరాకరణ

గత 11 ఏళ్లుగా నీటి సమస్యలపై భాజపా ఏ నిర్లక్ష్యం చూపిందో ఇప్పుడూ అదే కొనసాగిస్తోంది. భారాసను బతికించడానికి భాజపా పరోక్షంగా సాయం చేస్తోంది. కాంగ్రెస్ నేతలంతా ఆపార్టీపైనే దృష్టి పెట్టాలి. కిషన్‌రెడ్డి మాట్లాడే ప్రతిమాట కేటీఆర్ కార్యాలయం నుంచి వచ్చిందేనని నేను చెబుతున్నా. మేం వెళ్లి కిషన్‌రెడ్డిని కలసి తెలంగాణ సమస్యలను వివరిస్తే.. ఏ రోజూ మమ్మల్ని ఏ కేంద్ర మంత్రి వద్దకూ తీసుకెళ్లలేదు. నీటి సమస్యల పరిష్కారానికి ఇరురాష్ట్రాల మధ్య పెద్దన్న పాత్ర పోషించాల్సిన కేంద్ర ప్రభుత్వం పట్టనట్లు చూస్తోంది. ఏపీ నేతలు వారి రాష్ట్రానికి చెందిన సమస్యల గురించి కేంద్రంలో ప్రతి ఒక్కరినీ కలుస్తుంటే కిషన్‌రెడ్డి ఒక్క పనీ చేయకుండా సమస్యలు కొనసాగాలని చూస్తున్నారు. ఏపీ ప్రభుత్వం ముందుకొచ్చి తెలంగాణకు సహకరించాలి.

### నాటి సీఎం ఇచ్చిన వివరాలతోనే..

2016లో జరిగిన ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలో గోదావరి నుంచి సముద్రంలోకి 3000 టీఎంసీలు పోతున్నాయని కేసీఆర్ చెప్పారు. ఈ సమావేశం తర్వాత గోదావరిపెన్నా అనుసంధానానికి డీపీఆర్ బాధ్యతను వాప్కోస్ సంస్థకు అప్పగిస్తూ చంద్రబాబు నిర్ణయం తీసుకొన్నారు. గోదావరిపెన్నా మొదటి దశపై 2018లో మరో జీఓ ఇచ్చారు. అప్పుడు కేసీఆర్ ఇచ్చిన వివరాలతోనే గోదావరి జలాలను పెన్నాకు తరలించడానికి మొదటిదశ కింద వాప్కోస్‌తో ఏపీ ప్రభుత్వం సర్వే చేయిస్తే వారు 4 రకాల ఆప్షన్లు ఇచ్చారు. దీనిప్రకారం 400 టీఎంసీలను తరలించడానికి అవకాశం ఉందన్నారు.బనకచర్లలో 200 టీఎంసీలు ఎత్తిపోయడానికి ఇప్పుడు పంపులు పెడుతున్నా.. 300 టీఎంసీలు తీసుకెళ్లేలా విస్తరించడానికి ప్రణాళిక రూపొందించారు. మళ్లీ జగన్ సీఎం కాగానే నాటి ప్రగతిభవన్‌కు పిలిచి పెన్నానది వరకూ గోదావరి జలాలు తరలించవచ్చని కేసీఆర్ చెప్పారు. గోదావరిపై 968 టీఎంసీలను వాడుకోవడానికి మేం ప్రాజెక్టులు కట్టుకున్న తర్వాతే వరద, మిగులు జలాల లెక్కలు తేలతాయి. పోలవరం నుంచి మళ్లించే 80 టీఎంసీల నుంచి 45 టీఎంసీలు తెలంగాణకు ఇవ్వాలి. ఈ నీటిని, మైనర్ ఇరిగేషన్‌లో ఆదా అయిన నీటిని కలిపి పాలమూరురంగారెడ్డికి అనుమతి తెచ్చుకోవడానికి ఏపీ సహకరించాలి.

### గోదావరిలో 968 టీఎంసీల వినియోగం తరవాతే..

గోదావరిలో తెలంగాణకు 968 టీఎంసీలు, ఏపీకి 518 టీఎంసీలని ఉమ్మడి రాష్ట్రంలోనే నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కానీ దీనికి తగ్గట్లుగా కేసీఆర్ నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను కూడా పూర్తి చేయలేకపోయారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే చంద్రబాబుకు ధైర్యం వచ్చిందని, బనకచర్ల ద్వారా నెల్లూరు వరకూ తీసుకెళుతున్నారని ఇది కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అలుసని భారాస నేతలు అబద్ధాలు చెబుతున్నారు. తెలంగాణకు కేటాయించిన ప్రకారం 968 టీఎంసీలను, ఏపీలో కూడా 518 టీఎంసీల నికర జలాలను వినియోగించుకోవడానికి ప్రాజెక్టులు కట్టుకున్న తరవాత వరద, మిగులు జలాలు లెక్కతేల్చాలి.సమ్మక్కసారక్కకు ఇప్పటివరకు.. నీటి కేటాయింపులు రాలేదు. శ్రీరాంసాగర్‌లో పూడికవల్ల 40 నుంచి 50 టీఎంసీల సామర్థ్యం తగ్గిపోయింది. వ్యక్తులు ఎవరెవరికైనా పరిచయం ఉండొచ్చు. అంతమాత్రాన తెలంగాణ రైతుల హక్కులు తాకట్టు పెడతామా? న్యాయపరమైన అంశాలపై కొట్లాడతాం. కేసీఆర్‌తో పంచాయితీ పెట్టుకోవడం కంటే తెలంగాణ నీటి హక్కులను ఎలా సాధించుకోవాలనే..దానిపైనే ఈ సమావేశం ఏర్పాటుచేశాం. భాజపా రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న రామచందర్‌రావుకు శుభాకాంక్షలు చెబుతున్నా. మొదటి సమస్యగా గోదావరి నదీజలాల సమస్యను ప్రధాని దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆయనను కోరుతున్నా. నిర్మాణంలో ఉన్నవి పూర్తిచేస్తే పరిష్కారం దొరికేది నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు భారాస పూర్తిచేస్తే మన సమస్యలకు పరిష్కారం దొరికేది. ఎపెక్స్ కమిటీ సమావేశంలో 2015లో గానీ, 2019లో గానీ కృష్ణాలో మన వాటా కోసం కేసీఆర్ ఎప్పుడూ వాదించలేదు. అసలైన నీటి హక్కులను కూడా ఏపీకి ధారాదత్తం చేశారు. కృష్ణానదిలో ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల నికర జలాలుండేవి. ఈ జలాల పంపిణీలో విభజన సందర్భంగా వివాదాలు వస్తాయని నాటి ప్రధాని నదీ జలాల బోర్డులను ఏర్పాటుచేశారు. కొత్త ప్రాజెక్టులు నిర్మించాలంటే కూడా బోర్డు అనుమతి తీసుకోవాలన్నారు. ఉమ్మడి ఏపీకి సంబంధించిన 811 టీఎంసీల్లో 2015లో కేంద్రం నిర్వహించిన సమావేశంలో ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని హరీశ్‌రావు సంతకం చేశారు. కృష్ణానది పరీవాహక ప్రాంతం 68% తెలంగాణలో, 32% ఏపీలో ఉంది.ఈమేరకు 555 టీఎంసీలు తెలంగాణకు రావాలి. కానీ 2020లో జరిగిన కేఆర్ఎంబీ సమావేశంలో అడిగినా కూడా మళ్లీ భారాస ప్రభుత్వం 299 టీఎంసీలు చాలని చెప్పింది. ఇందులో ఏ ఏడాదైనా అత్యధికంగా వాడుకున్నది 221 టీఎంసీలు మాత్రమే. కొత్త ప్రాజెక్టులతో పాటు నిర్మాణంలో ఉన్న బీమా, నెట్టెంపాడు, పాలమూరు రంగారెడ్డి నీటి కేటాయింపులకు అనుమతులు తీసుకురాలేదు. దీనివల్ల 299 టీఎంసీలు కూడా వాడుకోలేదు. పెండింగ్ ప్రాజెక్టులతో పాటు 299 టీఎంసీలు పూర్తిగా వినియోగించుకునేలా కొత్త ప్రాజెక్టులు భారాస పాలనలో పూర్తిచేస్తే కృష్ణాలో 555 టీఎంసీల కోసం కొట్లాడే అవకాశం తెలంగాణకు ఉండేది'' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# సంక్షేమ' విద్యార్థులకు హెల్త్‌కార్డులు



ఈ కబురు, హైదరాబాద్: సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్‌కార్డులు సిద్ధం చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, జిల్లా మెడికల్, హెల్త్ అధికారులను సమన్వయం చేసుకొని హెల్త్‌కార్డులను వేగంగా సిద్ధం చేయాలని సూచించారు.

మంగళవారం ప్రజాభవన్‌లో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి సంక్షేమ హాస్టళ్లపై భట్టి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఏదైనా అనారోగ్య సమస్య వస్తే ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు కార్పొరేట్ ఆస్పత్రులు సిద్ధంగా ఉన్నాయని, వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

**హాస్టళ్ల సందర్శనపై లెక్కలుండాలి**

సంక్షేమ హాస్టళ్లను అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా సందర్శించాలని.. అందుకోసం పకడ్బందీ క్యాలెండర్ రూపొందించాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. ఏ అధికారి, ఏ రోజు హాస్టల్‌ను సందర్శించారు? హాస్టల్‌లో వారు పరిశీలించిన అంశాలేమిటి అన్నదానిపై నివేదికలు రూపొందించాలని సూచించారు. మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలను సైతం హాస్టళ్ల సందర్శనకు ఆహ్వానించాలని కోరారు. హాస్టళ్లు ఉన్న అద్దె భవనాల్లో వసతులు ఎలా ఉన్నాయి? ఆయా భవనాల యజమానులెవరు? అనే వివరాలతో నివేదిక రూపొందించాలని సూచించారు. అన్ని వసతి గృహాల్లో దోమతెరలు ఏర్పాటు చేయాలని తెలిపారు.

రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలన్నిటిపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటుచేసి విద్యుత్ అవసరాలు తీర్చుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులకు తెలిపారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్సీ గురుకుల సెక్రటరీ అలుగు వర్షిని, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ క్షితిజ, మైనార్టీ వెల్ఫేర్ శాఖ కమిషనర్ షఫీ, బీసీ గురుకుల సెక్రటరీ సైదులు, ఎస్టీ గురుకుల సెక్రటరీ సీతాలక్ష్మి, గిరిజన వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**విద్యుత్ శాఖ ఆధునిక టెక్నాలజీ వాడాలి**

విద్యుత్ వినియోగదారుల అవసరాలు తీర్చేందుకు ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకోవాలని విద్యుత్ ఉన్నతాధికారులకు భట్టి విక్రమార్క సూచించారు. ప్రజాభవన్ లో ఆయన దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్, డైరెక్టర్లతో మంగళవారం సమావేశమయ్యారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో 6,500 ఫీడర్లు ఉండగా, 5,500 ఫీడర్ల పరిధిలో ఔటర్ మేనేజ్‌మెంట్ సిస్టం అమలులోకి తెచ్చినట్లు అధికారులు వివరించారు. దీంతో మిగతా వాటి పరిధిలోనూ తేవాలని భట్టి సూచించారు.

# మారిన వ్యూహం.. ఒక్క నెలలోనే ఉక్రెయిన్‌పై 5438 డ్రోన్లు!

ఈ కబురు: రష్యాఉక్రెయిన్ మధ్య గడిచిన మూడేళ్లుగా కొనసాగుతున్న యుద్ధం ఇటీవల తన రూపాన్ని మార్చుకుంటున్నట్లు తెలుస్తోంది. అధునాతన, తీవ్ర నష్టాన్ని కలిగించే డ్రోన్లను రంగంలోకి దించుతున్న ఇరు దేశాలు.. యుద్ధక్షేత్రాన్ని ఈ సరికొత్త ఆయుధాలకు ప్రయోగ కేంద్రంగా మార్చుకుంటున్నాయి. ఈ క్రమంలో ఉక్రెయిన్‌పై ఒక్క జూన్‌లోనే రికార్డు స్థాయిలో 5438 డ్రోన్లను రష్యా ప్రయోగించింది. దీంతో మానవరహిత వైమానిక వాహనాల తయారీపై దృష్టిపెట్టిన కీవ్ వీటి ఉత్పత్తిని పెంచేందుకు ప్రయత్నాలు చేస్తోంది.దీర్ఘకాలంగా యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో వ్యూహాలు మారుస్తున్న ఇరుదేశాలు.. డ్రోన్ సాంకేతికతను మెరుగుపరచు కోవడంతోపాటు యుద్ధభూమిలో వాటి వినియోగంపై దృష్టి పెట్టాయి. ఈ క్రమంలో రష్యా విస్తృతంగా డ్రోన్లను ఉపయోగిస్తూ ఉక్రెయిన్ నగరాలపై భీకర దాడులకు పాల్పడుతోంది. ఇలా ఒక్క జూన్‌లోనే రికార్డు స్థాయిలో 5438 డ్రోన్లను ప్రయోగించింది. వీటిని జెలెన్‌స్కీ సైన్యం దీటుగా తిప్పికొడుతోంది. ఇందులో భాగంగా మాస్కోకు తూర్పున వెయ్యి కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇజెవ్‌స్క్‌లోని ఓ పారిశ్రామిక కర్మాగారంపై డ్రోన్ దాడి చేసింది. దీర్ఘశ్రేణి ఘటనలో అనేక మంది గాయపడినట్లు సమాచారం.ఇలా దీర్ఘశ్రేణి డ్రోన్లతో దాడులు చేస్తున్న ఉక్రెయిన్.. రష్యాలో పరిశ్రమలు, నిల్వ కేంద్రాలు, లాజిస్టిక్ హబ్‌లను లక్ష్యంగా చేసుకుంటోంది. డ్రోన్, గగనతల రక్షణ వ్యవస్థల తయారీ ప్లాంటుపై దాడి చేసింది. ఇలాంటి దాడులను ముమ్మరంగా కొనసాగించేందుకు వీలుగా వీటి ఉత్పత్తిని మరింత వేగవంతం చేయనున్నట్లు అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. డ్రోన్లు, ఇంటర్‌సెప్టర్ డ్రోన్లు, దీర్ఘశ్రేణి దాడులు చేసే డ్రోన్లే తొలి ప్రాధాన్యం అన్నారు. వీటిపైనే రష్యా ఎక్కువగా పెట్టుబడులు పెడుతోందని.. తాము కూడా దీటుగా ప్రతిస్పందించేందుకు సిద్ధమవుతున్నామన్నారు.




# బిల్లు ఆమోదిస్తే.. రేపే కొత్త పార్టీ ఏర్పాటు చేస్తా: ఎలాన్ మస్క్



ఈ కబురు: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన బిగ్ బ్యూటిఫుల్ బిల్లును ఎలాన్ మస్క్‌వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి ఆ బిల్లుపై ఆయన విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా బిల్లు కు ఆమోదం లభిస్తే మరుసటి రోజే కొత్త పార్టీ ఏర్పాటుచేస్తానంటూ హెచ్చరికలు కూడా చేశారు.బిగ్ బ్యూటిఫుల్ బిల్లుపై మస్క్ మొదటి నుంచి వ్యతిరేకంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ వ్యతిరేకత నేపథ్యంలో అధ్యక్షుడికి, టెస్లా అధినేతకు మధ్య విభేదాలు కూడా తలెత్తాయి. ఇటీవల ఈ బిల్లుకు సెనెట్‌లో ఆమోదం లభించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ బిల్లుపై విరుచుకుపడుతూ మస్క్ ఎక్స్ వేదికగా వరుస పోస్టులు పెట్టారు. సామాజిక సంక్షేమ కార్యక్రమాలని తగ్గించి.. అమెరికన్ల రుణాన్ని పెంచే ఈ ప్రజాదరణ లేని బిల్లుకు మద్దతిచ్చే చట్టసభ సభ్యులను పదవీచ్యుతుల్ని చేస్తానని బెదిరింపులకు దిగారు. ఈ బిల్లు పిచ్చిదని స్పష్టంగా కన్పిస్తుందన్నారు. ఇది రుణపరిమితిని భారీగా 5 ట్రిలియన్ డాలర్లకు పెంచుతుందని పునరుద్ఘాటించారు. ఇప్పుడు ప్రజల గురించి శ్రద్ధ వహించే కొత్త రాజకీయ పార్టీకి సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన చట్టసభ సభ్యులపై కూడా పలు విమర్శలు చేశారు. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గిస్తామని వారు తొలుత ప్రచారం చేశారన్నారు. ఇప్పుడు రుణభారాన్ని పెంచే బిల్లుపై ఓటు వేస్తే సిగ్గుతో తలదించుకోవాల్సి వస్తోందని విమర్శించారు. ఈ ఖర్చును పెంచే బిల్లు ఆమోదం పొందితే.. మరుసటిరోజే 'ది అమెరికా పార్టీ' ఏర్పడుతుందని హెచ్చరించారు. అమెరికాకు డెమోక్రటిక్‌రిపబ్లికన్ యూని పార్టీకి ప్రత్యామ్నాయం కావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. అది ప్రజల గొంతుకగా ఉంటుందన్నారు.

# సెటిల్‌మెంట్ అడ్డాలుగా పోలీసుస్టేషన్‌లు!



ఈ కబురు, హైదరాబాద్: దర్యాప్తు పేరుతో సివిల్ వివాదాలను పరిష్కరించే సెటిల్‌మెంట్ అడ్డాలుగా పోలీస్‌స్టేషన్లు మారుతున్నాయని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. దర్యాప్తు చేయడాన్ని కోర్టులు అడ్డుకోవని, అయితే దర్యాప్తు పేరుతో సెటిల్‌మెంట్ అడ్డాలుగా మార్చడం సరికాదని స్పష్టం చేసింది. సివిల్ వివాదాల్లో పోలీస్ సిబ్బంది జోక్యం చేసుకోకుండా సమావేశాలు నిర్వహించాలని, జోక్యం చేసుకున్నవారిపై చర్యలు తీసుకుని ఇతరులకు సందేశం ఇవ్వాలని ఆన్‌లైన్ ద్వారా విచారణకు హాజరైన రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబుకు సూచించింది. పోలీసు విధులకు సంబంధించి మార్గదర్శకాలు (ఎస్ఓపీ) జారీచేసి వెబ్‌సైట్‌లో, పోలీసుస్టేషన్లలో ఉంచేలా చర్యలు తీసుకోవాలని డీజీపీకి సూచించింది.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాగోల్ బండ్లగూడలోని ఓ ఇంటి వివాదంలో పోలీసులు జోక్యం చేసుకుంటున్నారంటూ పి.సుదర్శన్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ టి. వినోద్‌కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రూ.55 లక్షలు చెల్లించి సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవాలని పిటిషనర్‌ను పోలీసులు బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవద్దని.. సివిల్ కోర్టు ఇంజంక్షన్ ఉత్తర్వులున్నా... ప్రతివాదులైన ప్రైవేటు వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదుపై 19వ తేదీన పిటిషనర్‌ను పిలిపించి ఉదయం నుంచి రాత్రి వరకూ స్టేషన్‌లో ఉంచారని వివరించారు. హోంశాఖ తరఫు న్యాయవాది మహేశ్‌రాజె వాదనలు వినిపిస్తూ... ఫిర్యాదుపై సెక్షన్ 35 కింద నోటీసులు జారీ చేశామన్నారు. దర్యాప్తులో భాగంగా స్టేషన్‌కు పిలిపించామన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి... నోటీసుల పేరుతో ఒక వ్యక్తిని రోజంతా నిర్బంధించే అధికారం లేదన్నారు. 19వ తేదీ ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటల వరకూ స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజీని సమర్పించాలని ఆదేశిస్తూ విచారణను వచ్చేవారానికి వాయిదా వేశారు. కేసు విచారణకు నాగోలు సీఐ వ్యక్తిగతంగా హాజరయ్యారు.

# థాయ్ ప్రధానిని సస్పెండ్ చేసిన రాజ్యాంగ న్యాయస్థానం



ఈ కబురు, బ్యాంకాక్: థాయ్‌లాండ్ ప్రధానమంత్రి పేటోంగ్టార్న్ షినవత్రను రాజ్యాంగ న్యాయస్థానం మంగళవారం సస్పెండ్ చేసింది. పొరుగుదేశమైన కాంబోడియా ప్రధానితో జరిపిన చర్చల్లో ఆమె అతి వినయం ప్రదర్శిస్తూ మాట్లాడి, నైతిక ఉల్లంఘనకు పాల్పడ్డారన్న అభియోగంపై కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. మే 28న కాంబోడియా, థాయ్‌లాండ్‌ల మధ్య జరిగిన పోరులో కాంబోడియా సైనికుడొకరు మరణించాడు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతల్ని సడలించేందుకు కాంబోడియా ప్రధాని హున్‌సేన్‌తో థాయ్ ప్రధాని సంప్రదింపులు జరిపారు. ఈ చర్చల ఆడియో లీక్ కావడంతో షినవత్ర అతి వినయంపై విమర్శలు వెల్లువెత్తాయి. తుదితీర్పు వెలువడే వరకూ ఆమెను పదవి నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు కోర్టు ప్రకటించింది.

# ‘టాప్-20’లో స్థానం ఎస్‌బీఐ లక్ష్యం

**హైదరాబాద్:** ‘ప్రతి భారతీయుడి బ్యాంకర్’ అనే పేరున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రపంచంలోని అగ్రశ్రేణి బ్యాంకుల సరసన చేరాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచంలోని ‘టాప్ 20’ బ్యాంకుల్లో స్థానం సంపాదించాలనేది ఈ బ్యాంకు ఉద్దేశం. దీనికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని, 2047 నాటికి ఈ లక్ష్యాన్ని సాధిస్తామని ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి స్పష్టం చేశారు. దేశంలోని యువతకు బ్యాంకింగ్ రంగంలో ఎన్నో అవకాశాలు లభిస్తాయని, దీనికి సన్నద్ధం కావాలని సూచించారు. తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో ఎస్‌బీఐ క్రియాశీలక పాత్ర పోషిస్తోందని, ప్రభుత్వాలు ప్రజల అవసరాలు తీర్చటానికి తాము ముందుంటామని స్పష్టం చేశారు. దేశ ఆర్థికాభివృద్ధిలో ఎస్‌బీఐ పాత్ర, భవిష్యత్తు లక్ష్యాలు, సవాళ్లపై ఆయన ‘ఈనాడు’కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.



**తగినంత అవగాహన లేక ఎంతో మంది బ్యాంకు వినియోగదార్లు సైబర్ నేరగాళ్ల వలలో పడుతున్నారు. దీనికి పరిష్కారాన్ని ఆలోచిస్తున్నారా?**

సైబర్ నేరగాళ్ల వల్ల బ్యాంకింగ్ వ్యవస్థకు ముప్పు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. మా ఖాతాదార్ల రక్షణకూ అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం. ఖాతాదారులలో అవగాహన పెంపొందించే కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహిస్తున్నాం. అయితే.. ఎవరికి వారు అప్రమత్తంగా ఉండటం సరైన పరిష్కారం.

**ఎస్‌బీఐ 70 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. దేశ ఆర్థికాభివృద్ధిలో పోషించిన పాత్ర ఏమిటి, ముమ్ముందు బ్యాంకు పనితీరు ఎలా ఉండబోతోంది?**

‘ప్రతి భారతీయుడి బ్యాంకర్’ అనే పేరుకు తగ్గట్లుగా దేశ ప్రగతి ప్రస్థానంలో, ప్రజల బ్యాంకింగ్ అవసరాలు తీర్చటంలో ఎస్‌బీఐ అత్యంత క్రియాశీలక పాత్ర పోషిస్తోంది. ఎస్‌బీఐ ఏర్పాటైన తర్వాతే వ్యవసాయం, పరిశ్రమలు, చిన్నమధ్యతరహా సంస్థలకు రుణాలు ఇవ్వటం మొదలైంది. సంస్థాగత రుణాలు ఇచ్చే వ్యవస్థకు రూపకల్పన చేసిన ఘనత ఎస్‌బీఐ సొంతం. మన దేశం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొని విదేశీ కరెన్సీ కోసం ఇబ్బందులు పడుతున్నప్పుడు, పోఖ్రాన్ అణు పరీక్షలు నిర్వహించి అమెరికా ఆంక్షలు ఎదుర్కొన్నప్పుడు, కొవిడ్ పరిణామాల సమయంలో ప్రభుత్వాలకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా కీలక పాత్ర పోషించింది. ఇలాంటి ఉదాహరణలు ఎన్నో. ప్రజలకు ఇంకా దగ్గర కావటం, బ్యాంకింగ్ సేవలను సులభతరం చేయటం మా ప్రధాన లక్ష్యం. అదే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ‘టాప్ 20’ బ్యాంకుల్లో ఒకటిగా ఎదగాలనే ఆలోచన ఉంది. 2047 నాటికి దీన్ని సాధించాలని అనుకుంటున్నాం. ప్రస్తుతం ఎస్‌బీఐ ‘టాప్ 50’ బ్యాంకుల్లో ఉంది.

**విదేశీ బ్యాంకులు, ప్రైవేటు బ్యాంకులు భారీగా విస్తరిస్తున్నాయి. టెక్నాలజీపై పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నాయి. దీన్ని తట్టుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేస్తున్నారు?**

వినియోగదార్లకు సులభతర సేవలు అందించటం మా విజయ రహస్యం. మొబైల్ యాప్, ఇంటర్నెట్, బ్రాంచి బ్యాంకింగ్‌లలో ఎక్కడి నుంచైనా ఒకే తరహా సేవలు అందించే ‘ఓమ్ని ఛానల్’ అనుభూతిని కల్పించటానికి కృషి చేస్తున్నాం. దీంతో పాటు టెక్నాలజీపై భారీగా పెట్టుబడులు పెడుతున్నాం. ఎస్‌బీఐ ‘యోనో’ యాప్ వంటి అత్యాధునిక సాంకేతిక ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్నాం. ‘యోనో’ యాప్‌నకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. ఇప్పటికే 9 కోట్ల మంది వినియోగదారులు దీన్ని డౌన్‌లోడ్ చేసుకున్నారు. రోజూ 1.5 కోట్ల లావాదేవీలు దీనిపై నమోదవుతున్నాయి. సరికొత్త సేవలతో ‘యోనో 2.0’ యాప్‌ను తీసుకొచ్చే పనిలో నిమగ్నమయ్యాం. విదేశీ, ప్రైవేటు రంగ బ్యాంకులు ఎన్ని వచ్చినా తట్టుకొని నిలవటానికి, సమర్థంగా రూపొందటానికి ఎస్‌బీఐ నిరంతరం కసరత్తు చేస్తూ ఉంటుంది. అందుకే అగ్రస్థానంలో నిలవగలుగుతున్నాం.




**ఉత్పత్తి రంగానికి కీలకమైన చిన్న, మధ్యతరహా పరిశ్రమకు అధిక రుణాలిచ్చేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారా?**

గత ఆర్థిక సంవత్సరంలో రూ.42 లక్షల కోట్ల రుణాలు ఇచ్చాం. ఇందులో ఎస్ఎంఈ యూనిట్లు, వ్యవసాయ రంగం వాటా అధికంగా ఉంది. జీఎస్‌టీ, ఆదాయపు పన్ను రిటర్న్‌ల సమాచారం ఆధారంగా 48 గంటల్లోనే రుణాలు ఇచ్చే వ్యవస్థను ఆవిష్కరించాం. ప్రత్యేకంగా 800 ఎస్ఎంఈ శాఖలను ఏర్పాటు చేశాం. దాదాపు 200 మంది రిలేషన్‌షిప్ మేనేజర్ల ద్వారా ఎస్ఎంఈ యూనిట్లకు సేవలు అందిస్తున్నాం.

**బ్యాంకులకు ఎలాంటి సవాళ్లు కనిపిస్తున్నాయి?**

సవాళ్లే కాదు, అవకాశాలూ ఉన్నాయి. ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కాబట్టి, బ్యాంకింగ్ రంగానికి సత్వర వృద్ధి అవకాశాలు ఉన్నాయి. దీన్ని అందిపుచ్చుకోవటం అవసరం. ముఖ్యంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. బ్యాంకింగ్ రంగంలో గతంలో ఎన్నడూలేనంత అధికంగా యువతకు ఉద్యోగాలు లభిస్తాయి. ఇక సవాళ్ల విషయానికి వస్తే, నైపుణ్యాల లేమి పెద్ద సమస్య. దీంతో పాటు టెక్నాలజీ అమలు, స్థిరంగా అధిక వృద్ధి సాధించటం ఇతర సవాళ్లు.

**కొత్త రంగాలకు రుణాలు ఇవ్వడం, అంకుర సంస్థలకు అండగా నిలవడంలో ఎలాంటి పాత్ర పోషించాలని అనుకుంటున్నారు?**

గ్రీన్ హైడ్రోజన్, సెమీకండక్టర్ తదితర కొత్త తరం రంగాలకు చెందిన సంస్థలకు రుణాలు ఇవ్వటం పెద్ద సమస్య. వీటిపై బ్యాంకులకు తగినంత అవగాహన ఉండటం లేదు. సత్వర ఆర్థికాభివృద్ధికి ఇలాంటి రంగాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. బ్యాంకు సిబ్బంది కొత్త రంగాలు, సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సంపాదించే విధంగా తయారు చేయటం కోసం ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను ఏర్పాటు చేస్తున్నాం. అంకుర సంస్థల వ్యాపార విస్తరణకు అవసరమైన సలహాలు, వ్యూహాలు, నిధుల నిర్వహణపై తగిన అవగాహన కల్పించే సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రత్యేకంగా శాఖలు ఏర్పాటు చేస్తున్నాం. ఎస్‌బీఐ వెంచర్స్ ద్వారా మూలధన నిధుల లభ్యతకు చర్యలు తీసుకుంటున్నాం.

**రిజర్వ్ బ్యాంక్ ఈ మధ్య రెపోరేటు, సీఆర్ఆర్‌ను సవరించింది. దీని ప్రభావం బ్యాంకుల ఆదాయాలు, లాభాలపై ఎలా ఉంటుంది?**

రెపో ఆధారిత రుణాల వడ్డీ రేట్లు ఆ మేరకు తగ్గాయి. ఎంసీఎల్ఆర్ (మార్జినల్ కాస్ట్ లెండింగ్ రేట్) ఆధారిత రుణాల వడ్డీ రేట్లు త్వరలోనే తగ్గుముఖం పట్టవచ్చు. దీనివల్ల బ్యాంకులకు వడ్డీ ఆదాయాలు తగ్గే అవకాశం ఉంది. కానీ సీఆర్ఆర్‌ను 4 నుంచి 3 శాతానికి తగ్గించినందు వల్ల బ్యాంకులకు దాదాపు రూ.50,000 కోట్లు అందుబాటులోకి రాబోతున్నాయి. అందువల్ల 202526 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి బ్యాంకులకు ప్రస్తుత స్థాయి ఆదాయాలు, లాభాలు కొనసాగే అవకాశం ఉంది.

**తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో ఎస్‌బీఐ పాత్ర?**

ఈ రెండు రాష్ట్రాల ఆర్థికాభివృద్ధికి, ప్రజల బ్యాంకింగ్ అవసరాలు తీర్చటానికి ఎస్‌బీఐ కట్టుబడి ఉంది. తెలంగాణ రాష్ట్రానికి లీడ్ బ్యాంకు మేమే. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్‌బీఐ శాఖలు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజల ఆర్థిక అవసరాలు తీర్చటానికి గతంలో మాదిరిగానే భవిష్యత్తులోనూ ఎస్‌బీఐ కృషి చేస్తుంది.



## లాభాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు

దేశీయ మార్కెట్ సూచీలు మంగళవారం లాభాల్లో మొదలయ్యాయి. మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సోమవారం నష్టాల్లో ముగిసిన మార్కెట్లు.. నేడు సానుకూలంగా ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయంగా మిశ్రమ సంకేతాలు నెలకొన్నప్పటికీ మన సూచీలు లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఉదయం 9.34 గంటల సమయంలో సెన్సెక్స్ 220 పాయింట్లు పుంజుకొని 83,827 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 64 పాయింట్లు ఎగబాకి 25,581 దగ్గర కొనసాగుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 85.34గా ఉంది. అపోలో హాస్పిటల్స్, ఆసియన్ పెయింట్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, జియో ఫైనాన్షియల్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు లాభాల్లో కదలాడుతున్నాయి. ట్రెంట్, యాక్సిస్ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్, సిప్లా, టాటా కన్జూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ స్టాక్స్ నష్టాల్లో ఉన్నాయి.






## బయోలాజికల్ ఇ. నుంచి హెచ్‌పీవీ టీకా

**హైదరాబాద్:** టీకాలను ఉత్పత్తి చేసే హైదరాబాద్ సంస్థ బయోలాజికల్ ఇ.లిమిటెడ్ (బీఈ) హెచ్‌పీవీ టీకా ఉత్పత్తి చేయనుంది. దీని కోసం చైనా దేశానికి చెందిన బయోఫార్మాస్యూటికల్ సంస్థ జియాంగ్సు రెక్‌బయో టెక్నాలజీ కంపెనీ లిమిటెడ్‌తో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా రెక్‌బయోకు చెందిన 9వేలెంట్ హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్‌పీవీ9) టీకా ‘ఆర్ఈసీ 603’ ఉత్పత్తి చేసి వాణిజ్య పరంగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు బీఈకి లైసెన్సు లభించనుంది. గర్భాశయ క్యాన్సర్ సహా తొమ్మిది రకాల హెచ్‌పీ వైరస్‌ల నుంచి ఈ టీకా రక్షణ కల్పిస్తుంది. దీనిపై ప్రస్తుతం చైనాలో మూడోదశ క్లినికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. టీకా ఉత్పత్తి చేయడానికి అవసరమైన ఔషధ ముడి పదార్థాలను బీఈకి రెక్‌బయో సరఫరా చేస్తుంది. టీకా ఉత్పత్తి చేయడం, సీసాల్లో నింపడం, ప్యాకేజింగ్ చేయడానికి అవసరమైన సాంకేతికత పరిజ్ఞానాన్ని కూడా బదిలీ చేస్తుంది. టీకాను బీఈ ఉత్పత్తి చేసి మనదేశంతో పాటు, ఇతర దేశాలకు సరఫరా చేస్తుంది. బీఈతో ఒప్పందం తమ అంతర్జాతీయ విస్తరణకు వీలు కల్పిస్తుందని రెక్‌బయో వ్యవస్థాపకుడు, సీఈఓ డాక్టర్ లియు యాంగ్ అన్నారు. ప్రజలకు అవసరమైన వ్యాక్సిన్‌లను అందుబాటులోకి తీసుకురావడంతోపాటు, వాటిని అందుబాటు ధరలో అందించాలన్నదే తమ లక్ష్యమని బీఈ మేనేజింగ్ డైరెక్టర్ మహిమా దాట్ల తెలిపారు.

## ‘ఓవర్ టైమ్ వద్దు’.. ఉద్యోగులకు ఇన్ఫీ మెయిల్స్..

# తెర పైకి 70 గంటల వ్యాఖ్యలు!







**ప్రముఖ ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్ తమ ఉద్యోగుల వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌పై కీలక సూచనలు చేసింది. పని గంటలకు మించి పని చేయొద్దని సూచించింది**

. అదనపు గంటలు పనిచేస్తున్న వారికి వ్యక్తిగతంగా ఇమెయిల్స్ పంపిస్తోంది. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచిస్తోంది. ఈనేపథ్యంలో పలువురు ఇన్ఫీ వ్యవస్థాపకుల్లో ఒకరైన నారాయణమూర్తి వ్యాఖ్యలను ప్రస్తావిస్తున్నారు.

దేశంలో అతిపెద్ద ఐటీ కంపెనీల్లో ఒకటైన ఇన్ఫోసిస్‌లో దాదాపు 3.23 లక్షల మంది పని చేస్తున్నారు. 2023 నవంబర్ నుంచి ఈ సంస్థ హైబ్రిడ్ వర్క్ మోడల్‌ను అవలంబిస్తోంది. నెలలో కనీసం 10 రోజుల పాటు ఆఫీసుకొచ్చి పని చేయాలని ఉద్యోగులకు సూచించింది. అయితే, ఐటీ ఉద్యోగులు అదనపు పని గంటలు, నిద్రలేమి, టైమ్‌కి తినకపోవడం వంటి కారణాలతో అనారోగ్యం బారిన పడుతున్నట్లు గుర్తించింది. ముఖ్యంగా గుండె సంబంధిత అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయని గ్రహించిన సంస్థ హెచ్ఆర్ విభాగం ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటూ ఉద్యోగులకు సూచనలు చేస్తోంది.

ఇన్ఫోసిస్‌లో వారంలో ఐదు రోజుల చొప్పున రోజుకు సగటున 9.15 గంటలు పనిచేయాల్సి ఉంటుంది. నెలలో సగటున అంతకుమించిన గంటలు పని చేస్తున్న వారికి వ్యక్తిగతంగా ఇమెయిల్స్ పంపిస్తున్నారు. ముఖ్యంగా రిమోట్‌గా పనిచేస్తున్న వారికి ఏ రోజు ఎన్నెన్ని గంటలు పనిచేసిందీ ఇమెయిల్‌లో పేర్కొంటున్నారు. వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ ఉండాలని, పని సమయంలో ఎప్పటికప్పుడు బ్రేక్ తీసుకోవాలని అందులో ప్రస్తావిస్తున్నారు. పని గంటలు పూర్తి కాగానే వెంటనే విశ్రాంతి తీసుకోవాలని, అవసరమైతే తప్ప పని గంటల అనంతరం ఉద్యోగ జీవితానికి సంబంధించి పనులకు వీలైనంత దూరంగా ఉండాలని సూచిస్తోంది.

**నారాయణమూర్తి అలా..**

భారతీయులు వారంలో 70 గంటల పాటు పని చేయాలంటూ వ్యాఖ్యానించి పెద్ద చర్చకే దారితీశారు ఆ సంస్థ వ్యవస్థాపకులు నారాయణమూర్తి. ఆయన అభిప్రాయంపై బహిరంగంగా విమర్శలు వ్యక్తమైనప్పటికీ.. మరో సందర్భంలో దాన్ని సమర్థించుకున్నారు. 1986లో తీసుకొచ్చిన ఐదు రోజుల పని దినాలనూ ఆయన బహిరంగంగానే విమర్శించారు. వర్క్‌లైఫ్ బ్యాలెన్స్‌కు తాను వ్యతిరేకమంటూ కుండబద్దలు కొట్టారు. ఈనేపథ్యంలో ఇన్ఫోసిస్ తమ ఉద్యోగుల వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపించడంతో కొత్త చర్చ మొదలైంది. ఇన్ఫోసిస్ నిర్ణయానికి నారాయణమూర్తి వ్యాఖ్యలకు ముడిపెడుతున్నారు.

# అయిదేళ్లలో జీఎస్‌టీ వసూళ్లు రెట్టింపు

**దిల్లీ:** గత ఆర్థిక సంవత్సరం(202425)లో స్థూల జీఎస్‌టీ వసూళ్లు జీవనకాల గరిష్ఠమైన రూ.22.08 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 202021లో రూ.11.37 లక్షల కోట్లతో పోలిస్తే గత అయిదేళ్లలో ఇవి రెట్టింపయ్యాయని ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. ఇక 202324 వసూలైన రూ.20.18 లక్షల కోట్లతో పోలిస్తే ఇవి 9.4 శాతం ఎక్కువ. 202425లో సగటు నెలవారీ వసూళ్లు రూ.1.84 లక్షల కోట్లుగా ఉన్నాయి. 201718లో రూ.90,000 కోట్లు, 202122లో రూ.1.51 లక్షల కోట్లు, 202324లో రూ.1.68 లక్షల కోట్ల నుంచి ఇవి పెరిగాయి. గత 8 ఏళ్లలో జీఎస్‌టీ కింద నమోదైన పన్ను చెల్లింపుదార్ల సంఖ్య 2017లో 65 లక్షల నుంచి 1.51 కోట్లకు చేరింది.

2017 జులై 1న జీఎస్‌టీ విధానం అమల్లోకి వచ్చింది. సోమవారానికి జీఎస్‌టీ విధానానికి 8 ఏళ్లు పూర్తి కానుంది. 17 స్థానిక పన్నులు, 13 సెస్సులను ఏకీకృతం చేసి, అయిదు అంచెల వ్యవస్థగా మార్చారు. 2025 ఏప్రిల్‌లో నెలవారీ జీఎస్‌టీ వసూళ్లు రికార్డు గరిష్ఠమైన రూ.2.37 లక్షల కోట్లుగా ఉన్నాయి.




**జీఎస్‌టీ పరిధిలోకి పెట్రో ఉత్పత్తులను తీసుకురండి**

జీఎస్‌టీ పరిధిలోకి పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనం(ఏటీఎఫ్), ఇతర పెట్రోలియం ఉత్పత్తులను తీసుకురావాలని పీడబ్ల్యూసీ ఇండియా నివేదిక సూచించింది. నిబంధనలను సరళతరం చేయాలని, పన్ను శ్లాబ్‌లను మూడుకు పరిమితం చేయాలని పేర్కొంది. ‘ప్రస్తుతం భారత్‌లో జీఎస్‌టీ విధానం కీలక మలుపు వద్ద ఉంది. అంతర్జాతీయ వాణిజ్య ధోరణులకు అనుగుణంగా ఇది ఉండాల్సిన అవసరం ఉంది. అంతర్జాతీయ వాణిజ్యంలో వచ్చిన మార్పులతో పాటు తయారీ, జీసీసీ రంగాల్లో పెట్టుబడులకు ఆకర్షించే విధంగా జీఎస్‌టీ ఉండాలి. పెట్టుబడిదార్లకు సులభంగా, అంతర్జాతీయ స్థాయిలో పోటీ ఇచ్చే విధంగా మెరుగుపరచాలి’ అని పీడబ్ల్యూసీ వెల్లడించింది. ప్రస్తుతం ఉన్న 4 శ్లాబ్‌ల నుంచి 3 శ్లాబ్‌లకు మార్చడం ద్వారా వివాదాలు తగ్గడం, పన్ను అనిశ్చితులు మెరుగుపడతాయని వివరించింది.

# రైల్వే సూపర్ యాప్ వచ్చేసింది..

# ఇక అన్ని సేవలూ ఒకేచోట


రైల్వేకు సంబంధించిన అన్ని సేవలూ ఒకేచోట అందించే సూపర్ యాప్ అందుబాటులోకి వచ్చింది. తొలుత స్వరైల్ పేరిట ఈ సూపర్ యాప్‌ను పరీక్షించిన రైల్వే శాఖ.. తాజాగా రైల్‌వన్ పేరిట పౌరులందరికీ అందుబాటులోకి తెచ్చింది. దీని సాయంతో రిజర్వ్‌డ్/ అన్‌రిజర్వ్‌డ్ టికెట్లు, ప్లాట్‌ఫామ్ టికెట్లు, రైళ్ల ఎంక్వైరీ, పీఎన్ఆర్, జర్నీ ప్లానింగ్, రైల్ మదద్, ఫుడ్ ఆన్ ట్రైన్ వంటి సేవలు పొందొచ్చు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

**రైల్‌వన్: సూపర్ యాప్ రిజిస్ట్రేషన్.. స్టెప్ బై స్టెప్ ప్రాసెస్ ఇదీ!**

సూపర్ యాప్‌లో ప్రస్తుతానికి అందుబాటులోకి వచ్చిన సేవలన్నీ ఆన్‌లైన్‌లో, యాప్ రూపంలో వేర్వేరుగా అందుబాటులో ఉన్నాయి. ఒక్కో సేవకు ఒక్కో యాప్ ఉంది. వీటన్నింటినీ ఒకేచోట అందించడమే ఈ సూపర్ యాప్ లక్ష్యం. దీన్ని కొన్ని నెలలుగా పరీక్షించిన రైల్వేశాఖ.. ఎట్టకేలకు యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ముమ్ముందు మరిన్ని సేవలను ఇందులో జోడించే




అవకాశం ఉంది. ఈ యాప్‌ను అభివృద్ధి చేసిన సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్ వార్షికోత్సవం సందర్భంగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ లాంచ్ చేశారు.




## 'విశ్వంభర' ఈ ఏడాది కష్టమే

చిరంజీవి 'విశ్వంభర' సినిమా 2023 అక్టోబర్ నెలలో పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. ఈ ఏడాది సంక్రాంతి సమయంలో విడుదల కావాల్సి ఉంది. ఆ మేరకు అధికారికంగా ప్రకటించారు కూడా.. కానీ, పలు కారణాలతో వాయిదా వేశారు. అయితే, ఇప్పటికీ విశ్వంభర నుంచి ఎలాంటి అప్డేట్ రాలేదు. దీంతో మెగా ఫ్యాన్స్ తీవ్ర నిరాశలో ఉన్నారు. దర్శకుడు వశిష్ఠ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఎప్పుడు విడుదల అవుతుందో కూడా తెలియని పరిస్థితి ఉంది. తాజా సమాచారం ప్రకారం, ఈ ఏడాదిలో ఈ సినిమా విడుదల కష్టమే అని తెలుస్తోంది. జులైఆగష్టు నెల దాటితే వచ్చే ఏడాది సమ్మర్‌లోనే విశ్వంభర ప్రేక్షకుల ముందుకు రావచ్చని ఇండస్ట్రీలో టాక్ ఉంది.

విశ్వంభర టీజర్‌లో చూపించిన గ్రాఫిక్స్‌పై చిరు అభిమానుల నుంచి కూడా విమర్శలు వచ్చాయి. వీఎఫ్ఎక్స్ పనుల విషయంలో భారీగా ట్రోల్స్ రావడంతో విశ్వంభరకు గ్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. దీంతో సినిమా మరింత ఆలస్యం అయింది. ఈ ఏడాది దసరాకు విశ్వంభరను విడుదల చేయలేరు. ఆ సమయంలో అఖండ2, ఓజీ చిత్రాలు ఉన్నాయి. దీపావళీకి ఇప్పటికే చాలా సినిమాలు లాక్ అయిపోయాయి. నవంబర్, డిసెంబర్ నెలలో విడుదల చేద్దామంటే వచ్చే సంక్రాంతికి అనిల్ రావిపూడి చిరు సినిమా జనవరి 10 స్లాట్‌ను బుక్ చేసుకుంది.

తక్కువ గ్యాప్‌లో ఇలా రెండు సినిమాలు వస్తే మార్కెట్ మీద ప్రభావం చూపొచ్చు. అందుకే విశ్వంభరకు కష్టాలు ఎక్కువ అయ్యాయి. చూస్తుంటే 2026 సంక్రాంతికి మెగా 157 ముందు రిలీజై ఆ తర్వాత తాపీగా విశ్వంభర వస్తుందనే కామెంట్స్ ఇండస్ట్రీలో బలంగా వినిపిస్తున్నాయి. విశ్వంభర టీజర్‌లో వచ్చిన విమర్శల వల్ల దర్శకుడు వశిష్ట కూడా మరింత అలర్ట్ అయిపోయాడట. చిరంజీవి లాంటి పెద్ద హీరోతో ఛాన్స్ వచ్చినప్పుడు దానిని కాపాడుకోవాలని క్వాలిటీ విషయంలో రాజీ పడకుండా పగలు రాత్రి విశ్వంభర కోసం పనిచేస్తున్నారట. విడుదల ఆలస్యం అయినా సరే భారీ హిట్ కొట్టాలని ఆయన ప్లాన్ చేస్తున్నారట.

# అభిమానులకు క్షమాపణలు చెప్పి.. ప్రామిస్ చేసిన నితిన్..



**నితిన్, సప్తమిగౌడ జంటగా వేణు శ్రీరామ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'తమ్ముడు' . లయ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రాన్ని దిల్‌రాజు నిర్మించారు. జులై 4న థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మూవీ టీమ్ పాల్గొంది. అందులో నితిన్ మాట్లాడుతూ ఇకపై మంచి సినిమాలు మాత్రమే చేస్తానని ప్రామిస్ చేశారు.**

''చాలా తక్కువ మాట్లాడాలని అనుకుంటున్నా. ఈ సినిమా హిట్ కావాలని ముగ్గురి కోసం కోరుకుంటున్నాను. మొదట మా దర్శకుడు వేణు శ్రీరామ్.. 'తమ్ముడు' కోసం రెండేళ్లు చాలా కష్టపడ్డారు. అలాగే నన్ను ఇష్టపడే వాళ్ల కోసం ఈ సినిమా విజయం సాధించాలి. నాకు హిట్ వస్తే ఆనందపడేవాళ్లు.. ఫ్లాప్ వస్తే బాధపడేవాళ్ల కోసం ఇది విజయం సాధించాలి. నేను ఇటీవల నటించిన సినిమాలు మిమ్మల్ని సంతోషపెట్టలేకపోయాయి. దానికి మీ అందరినీ క్షమాపణలు కోరుతున్నాను. ఇక నుంచి మంచి సినిమాలతోనే మీ ముందుకువస్తానని ప్రామిస్ చేస్తున్నాను. 'తమ్ముడు' సినిమా మీ అందరినీ సంతోషపెడుతుందని అనుకుంటున్నాను. ఈ సినిమా పూర్తికావడానికి టీమ్ ఎంతో కష్టపడింది'' అని నితిన్ చెప్పారు.

**కెరీర్ ఆరంభంలోనే బెస్ట్ ఫెయిల్యూర్‌ని చూసేశా!**

**రామ్‌చరణ్‌తో త్వరలోనే సినిమా: దిల్‌రాజు**

''ఈ సినిమాకు సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. వేణు శ్రీరామ్ చాలా కష్టపడ్డారు. ఆయనతో నాకు 21 ఏళ్ల స్నేహం ఉంది. కుటుంబసభ్యుడితో సమానం. నితిన్ విషయానికొస్తే.. తన గత సినిమాలు ప్రేక్షకాదరణను సొంతం చేసుకోలేకపోయాయని బాధలో ఉన్నాడు. ఈ సినిమాతో మంచి కమ్‌బ్యాక్ ఇస్తాడు. ఎంత స్పీడ్‌గా కిందపడ్డాడో అంతేస్థాయిలో పైకి లేస్తాడు. ఫెయిల్యూర్‌లు లేకపోతే విజయాన్ని ఆస్వాదించలేం. ఇక ఈ సంవత్సరం మాకు 'గేమ్ ఛేంజర్'తో చిన్న లోటు వచ్చింది. రామ్‌చరణ్‌తో సూపర్‌హిట్ తీయలేకపోయామనే లోటు ఉంది. త్వరలోనే ఆయనతో మంచి సినిమా చేస్తాం. దీనికి సంబంధించిన ప్రయత్నాలు మొదలయ్యాయి. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వస్తుంది'' అని దిల్ రాజు అన్నారు. జులై 3న 'తమ్ముడు' ప్రీమియర్ షోలు ఉండనున్నట్లు చెప్పారు.

**లయ రెండేళ్ల నుంచి ఇండియాలోనే: వేణు శ్రీరామ్**

''దిల్ రాజు శిరీష్‌లు నాకు కుటుంబసభ్యులతో సమానం. వారు నాపై ఎంతో నమ్మకంతో ఉన్నారు. నితిన్ ఎంతో సపోర్ట్ చేశారు. ఈ సినిమా తర్వాత కొత్త నితిన్‌ను చూస్తారు. లయ ఈ సినిమా కోసం రెండేళ్ల నుంచి ఇండియాలోనే ఉన్నారు. వారి కుటుంబసభ్యులకు ఈ విషయంలో ధన్యవాదాలు చెప్పాలి'' అని దర్శకుడు అన్నారు

**రెండేళ్లు కాదు.. పదేళ్లైనా ఉంటా: లయ**

''ఈ సినిమా కథ వినగానే భిన్నంగా అనిపించింది. ఎన్నో ఎమోషన్స్ ఉన్నాయి. నిజ జీవితంలో నాకు తోబుట్టువులు లేరు. ఈ సినిమాలో మాత్రం చాలామంది ఉన్నారు. సినిమా కోసం రెండేళ్లు కాదు.. పదేళ్లు అయినా ఇక్కడే ఉంటాను. అంత గొప్ప సినిమా ఇది. సినిమా మొత్తం చెప్పులు లేకుండా పరిగెత్తాను. ఆ నొప్పికి ఒక్కోసారి టీమ్ మీద అరిచేశాను. వారందరికీ సారీ. నా పాత సినిమాలను ఆదరించినట్లే 'తమ్ముడు'ను కూడా ఆదరిస్తారని ఆశిస్తున్నాను'' అని లయ తెలిపారు.

# అందుకే చాలా ఆఫర్స్ వదులుకున్నాను: సప్తమి గౌడ



'తమ్ముడు'లో తాను పవన్ కల్యాణ్ అభిమానినని.. తన పాత్రకు మహిళా ప్రేక్షకులంతా ఫిదా అవుతారంటున్నారు నటి సప్తమి గౌడ . నితిన్ ప్రధానపాత్రలో శ్రీరామ్ వేణు దర్శకత్వంలో తెరకెక్కిన 'తమ్ముడు' జులై 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో ఆమె ఓ కీలకపాత్రలో కనిపించనున్నారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సప్తమి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇందులో తాను రత్న అనే పాత్రలో కనిపించనున్నట్లు చెప్పారు. 'తమ్ముడు' గురించి సప్తమి చెప్పిన విశేషాలు తన మాటల్లోనే..

**హార్స్ రైడింగ్ నేర్చుకున్నా..**

'కాంతార' సినిమా తర్వాత దర్శకుడు శ్రీరామ్ వేణు దగ్గర నుంచి ''తమ్ముడు'' కోసం కాల్ వచ్చింది. హైదరాబాద్ వచ్చి లుక్ టెస్ట్ ఇచ్చాను. అది ఓకే అయ్యాక.. డైలాగ్ వెర్షన్ చెప్పారు. హార్స్ రైడింగ్ నేర్చుకోమన్నారు. అరకులో షూటింగ్ చేశారు. నితిన్ భుజానికి గాయం కావడంతో షూటింగ్ కొంత ఆలస్యమైంది. ఈ సినిమాలో వర్క్ చేయడం ఎప్పటికీ మర్చిపోలేని అనుభవం. కొండలు, గుట్టల్లో హార్స్ రైడింగ్ చేయాల్సి వచ్చింది. రోజూ మూడు, నాలుగు గంటలు హార్స్ రైడింగ్ చేయడంతో ఇబ్బందిపడ్డాను. కానీ ఆ సన్నివేశాలన్నీ బాగా వచ్చాయనే సంతృప్తి ఎంతో ఆనందాన్నిచ్చింది.

**పవన్ కల్యాణ్ అభిమానిని..**

అంబరగొడుగు అనే ఊర్లో ఉండే రత్న అనే అమ్మాయి పాత్రనాది. తను పవన్ కల్యాణ్ అభిమాని. నా క్యారెక్టర్‌కు ఒక భిన్నమైన లవ్ స్టోరీ కూడా ఉంటుంది. 'కాంతార' లుక్‌లా ఉన్నా.. క్యారెక్టర్ మాత్రం డిఫరెంట్‌గా ఉంటుంది. ''తమ్ముడు'' సీరియస్ సబ్జెక్ట్.. ఇందులో నా క్యారెక్టర్ ద్వారా ఫన్ క్రియేట్ అవుతుంది. లయ, నితిన్ అంబరగొడుగు వచ్చినప్పుడు వారి జర్నీలో రత్న ఎలా భాగమైంది అనేది ఆసక్తికరంగా ఉంటుంది. వీళ్లిద్దరూ ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉంటారు. రత్న రేడియో జాకీ కాదు. ఈ సినిమా రిలీజ్ అయ్యేలోగా పవన్ కల్యాణ్ నటించిన 'తమ్ముడు' కచ్చితంగా చూస్తాను.

**నిడివి తక్కువ ప్రభావం ఎక్కువ..**

''తమ్ముడు'' సినిమా నటిగా నాకు మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నా. ఈ చిత్రంలో నాది నిడివి ఎక్కువ ఉన్న పాత్ర కాదు.. కానీ ప్రభావవంతమైన పాత్ర. దాన్ని రాసేటప్పుడు బాగా ఎంజాయ్ చేసినట్లు డైరెక్టర్ చెప్పారు. ఈ సినిమాకు ఫస్ట్ సెలెక్ట్ అయిన ఆర్టిస్ట్ నేనే.

**మహిళా ప్రేక్షకులు ఫిదా అవుతారు..**

''తమ్ముడు''లో నాతో పాటు లయ, దిత్య, వర్ష, స్వసిక.. అందరివీ కీలకమైన పాత్రలే. డిఫరెంట్‌గా, పవర్ ఫుల్‌గా ఉంటాయి. లయ గారు స్ట్రిక్ట్ ఆఫీసర్‌గా కనిపిస్తారు. నేను, వర్ష ఫైట్ సీక్వెన్స్‌లోనూ నటించాం. సినిమాల్లో హీరోతో డ్యాన్స్ వేసే హీరోయిన్ క్యారెక్టర్స్ చూస్తుంటాం. కానీ ఇందులో ఫైట్ చేసే హీరోయిన్స్‌ను చూస్తారు. మహిళా పాత్రలను ఇంత బలంగా తెరకెక్కించినందుకు మహిళా ప్రేక్షకులు చాలా హ్యాపీగా ఫీలవుతారు.

**లవ్‌ట్రాక్ బాగుంటుంది..**

ఈ మూవీలో నితిన్‌తో నాకు లవ్ ట్రాక్ ఉంటుంది. మూవీలో రత్న, నితిన్ క్యారెక్టర్ కలవాలని ప్రేక్షకులు కోరుకుంటారు. దిల్ రాజు బ్యానర్‌లో చేయడం ఎంతో ఆనందంగా ఉంది. డైరెక్టర్ శ్రీరామ్ వేణు ఈ మూవీ కోసం ఎంతో కష్టపడ్డారు. మంచి అవుట్‌పుట్ కోసం టీమ్ ఎంతో శ్రమించింది. ఈ సినిమాను థియేటర్‌లో చూస్తేనే బాగా ఎంజాయ్ చేయగలరు.

**ఆ తరహా పాత్రలంటే ఇష్టం..**

నాకు కమర్షియల్ మూవీస్ చేయడం ఇష్టం. ''తమ్ముడు'' ఆ తరహా సినిమానే. 'పుష్ప'లో రష్మిక చేసిన పాత్ర నాకు చాలా నచ్చింది. అలాంటి ఆఫర్స్ వస్తే చేసేందుకు సిద్ధంగా ఉన్నాను. 'కాంతార' సక్సెస్ తర్వాత నాకు అదే తరహా పాత్రలు వచ్చాయి. అందుకే చాలా మూవీస్ వదులుకున్నాను. ఎక్కువ చిత్రాల్లో మీకు నేను కనిపించకపోవడానికి కారణమదే. డిఫరెంట్ రోల్స్ వస్తే తప్పకుండా చేస్తా. ప్రస్తుతం తెలుగులో మరో రెండు చిత్రాలతో పాటు తమిళంలో, కన్నడలో మూవీస్ చేస్తున్నా. వాటి వివరాలు త్వరలో వెల్లడిస్తా. భాషతో సంబంధం లేకుండా అన్ని చిత్రాల్లో నటించాలని కోరుకుంటున్నా.

## కొత్తపల్లిలో ఒకప్పుడు!



**'కేరాఫ్ కంచరపాలెం, ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' వంటి సినిమాలను నిర్మించిన నటి–నిర్మాత ప్రవీణ పరుచూరి 'కొత్తపల్లిలో ఒకప్పుడు..' అనే సినిమాతో దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. 'కేరాఫ్ కంచరపాలెం' సినిమాను నిర్మించిన రానా, ప్రవీణ కలిసి మళ్లీ 'కొత్తపల్లిలో ఒకప్పుడు..' చిత్రం నిర్మిస్తున్నారు.**

**"ఓ ఘటన తర్వాత ఊహించని మలుపు తిరిగిన ఓ గ్రామీణ యువకుడి జీవితం నేపథ్యంతో ఈ సినిమా కథనం ఉంటుంది. తెలుగు సినిమాకు ఒక లవ్‌లెటర్‌లాంటిది ఈ చిత్రం. నటీనటుల వివరాలు త్వరలో తెలియజేస్తాం"అని యూనిట్ పేర్కొంది.**

## పెళ్లి కుదరడంతో అమితాబ్ సినిమాను తిరస్కరించా: నటి మధుబాల



ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా సూపర్‌హిట్ సినిమాలతో అలరించారు నటి మధుబాల. 1999లో వివాహం చేసుకున్న తర్వాత వెండితెరకు దూరమైన ఆమె.. మళ్లీ సహాయ నటి పాత్రలతో పలకరిస్తున్నారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నటనకు విరామం తీసుకోవడం గురించి మాట్లాడారు. దక్షిణాదిలో నటించిన తర్వాత బాలీవుడ్ సినిమాల్లో చేయడం సౌకర్యంగా ఉండేది కాదన్నారు.''1997 తర్వాత నేను చేసే పాత్రలు ఆసక్తికరంగా అనిపించలేదు. ఉత్సాహంగా సెట్స్‌కు వెళ్లాలనిపించేది కాదు. దక్షిణాదిలో గొప్పగొప్ప దర్శకులతో పనిచేశాను. ఆ తర్వాత బాలీవుడ్‌లో నటించాను. ఇక్కడ కొన్ని చిత్రాల్లో వర్క్ చేశాక నాకు వింత అనుభవాలు ఎదురయ్యాయి. ఒక నటిగా నాకు సెట్స్‌కు వెళ్లడం బాధగా అనిపించేది. ఒకప్పుడు ఎప్పుడూ సెట్స్‌లో ఉండాలని కోరుకున్న నేను.. కొంతకాలానికి సెట్స్‌లో ఉండాలంటేనే చిరాకు అనిపించడం ప్రారంభించింది. అందుకే విరామం తీసుకుందామనుకున్నాను'' అని చెప్పారు.ఇక అమితాబ్ సినిమాను తిరస్కరించడం గురించి మాట్లాడుతూ.. ''సినిమాలకు కొన్ని రోజులు విరామం తీసుకుందామని నిర్ణయించుకున్నప్పుడే ప్రేమ నా జీవితంలోకి ప్రవేశించింది. వివాహం నిశ్చయమైంది. ఆ సమయంలోనే అమితాబ్ సినిమాలో అవకాశం వచ్చింది. అప్పటికే పెళ్లి తేదీ ఫిక్స్ కావడంతో ఆ సినిమాను తిరస్కరించాను. నా మేనేజర్ కూడా ఒకసారి నా ఆలోచనను పునఃపరిశీలించుకోవాలని కోరారు. నేను అదే మాట మీద ఉండడంతో ఆ అవకాశం సౌందర్యను వరించింది'' అని చెప్పారు. అదే 'సూర్యవంశం' మూవీ. తెలుగులో ఈ మూవీని వెంకటేశ్‌తో తీసిన సంగతి తెలిసిందే.1991లో తమిళ సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు మధుబాల. ఆ తర్వాత హిందీ, మలయాళం, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో వరుస సినిమాలు చేసి ఆకట్టుకున్నారు. 1999లో వివాహం అనంతరం ముంబయిలో స్థిరపడిన మధు నటనకు విరామం తీసుకున్నారు. మళ్లీ కొన్నేళ్ల నుంచి సహాయ నటి పాత్రల్లో నటిస్తున్నారు. ఇటీవల వచ్చిన 'కన్నప్ప' సినిమాలో అతిథి పాత్రలో కనిపించిన విషయం తెలిసిందే.

## మెగా ఫ్యాన్స్‌కు దిల్ రాజు సోదరుడు క్షమాపణలు



రామ్ చరణ్ అభిమానులకు దిల్ రాజు సోదరుడు శిరీష్‌రెడ్డి క్షమాపణలు తెలిపారు. తాను మాట్లాడిన మాటలతో మెగా అభిమానులు బాధపడినట్లు తెలిసిందన్నారు. నా వ్యాఖ్యల పట్ల ఎవరినైనా ఇబ్బందిపెట్టి ఉంటే కమాపణలు కోరుతున్నట్లు పత్రిక ప్రకటన విడుదల చేశారు. గేమ్ ఛేంజర్ కోసం రామ్ చరణ్ తమకు పూర్తిగా సహకరించారని ఆయన లేఖలో రాసుకొచ్చారు. మెగాస్టార్ చిరంజీవి కుటుంబంతో తమకు ఎన్నో ఏళ్లుగా మంచి సాన్నిహిత్యం ఉందని తెలిపారు. తాము ఎట్టి పరిస్థితుల్లోనూ మెగాస్టార్ చిరంజీవి, రామ్ చరణ్‌తో పాటు మెగా హీరోల ప్రతిష్టకు భంగం కలిగేలా వ్యవహరించమని శిరీష్ రెడ్డి లేఖలో ప్రస్తావించారు. ఒకవేళ నా మాటలు ఎవరి మనోభావాలను అయినా ఇబ్బంది పెట్టే విధంగా ఉంటే క్షమించాలని లేఖ ద్వారా కోరారు.

అయితే గేమ్ ఛేంజర్ సినిమా ఫెయిల్యూర్ తర్వాత రామ్ చరణ్ కానీ, డైరెక్టర్ శంకర్ కానీ కనీసం ఫోన్ కూడా చేయలేదని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అయితే తన సోదరుడు చేసిన కామెంట్స్‌పై దిల్ రాజు వివరణ కూడా ఇచ్చారు. అతను ఎప్పుడు ఇంటర్వ్యూలు ఇవ్వలేదని.. ఫస్ట్ టైమ్ కావడం వల్లే ఎమోషనల్‌గా అలా మాట్లాడి ఉంటారని అన్నారు. ఈ నేపథ్యంలోనే మెగా ఫ్యాన్స్ నుంచి వ్యతిరేకత రావడంతో శిరీష్ రెడ్డి క్షమాపణలు చెబుతూ లేఖ విడుదల చేశారు.

**అసలు శిరీష్ రెడ్డి ఏం చెప్పారంటే?**

గేమ్ ఛేంజర్ గురించి నిర్మాత శిరీష్ రెడ్డి మాట్లాడుతూ..' గేమ్ ఛేంజర్ సినిమాతో మా బతుకు అయిపోయిందని అనుకున్నాం. అయితే, సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో మళ్లీ నిలబడుతామని నమ్మకం వచ్చింది. ఇదంతా కూడా కేవలం 4రోజుల్లోనే జీవితం మారిపోయింది. ఆ సినిమా లేకుంటే మా పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకోలేం. అప్పుడు అందరూ మా పని అయిపోయిందని హేళన చేసేవారు. గేమ్ ఛేంజర్ ఫ్లాప్ అయింది. హీరో వచ్చి మాకు ఏమైన సాయం చేశాడా..? దర్శకుడు వచ్చి ఏమైనా సాయం చేశాడా..? అంత నష్టం వచ్చినా కూడా వారు కనీసం ఒక్క ఫోన్ కాల్ చేసి ఎలా ఉన్నారు..? పరిస్థితి ఏంటి అని కూడా ఎవరూ అడగలేదు. చివరకు చరణ్ కూడా అడగలేదు. అలా అని నేను వారిని తప్పుపట్టడం లేదు.' అని అన్నారు.



## సచిన్ సూపర్ పవర్ నాకు కావాలి

**ఢిల్లీ:** సచిన్ తెందుల్కర్ సూపర్ పవర్ తనకు కావాలని కోరుకుంటున్నానని స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా అన్నాడు. ఎంతో మంది గొప్ప బౌలర్ల సవాళ్లను సచిన్ సమర్థంగా ఎదుర్కొన్నాడని నీరజ్ చెప్పాడు. ఏ క్రికెటర్ సూపర్ పవర్‌ను సొంతం చేసుకోవడానికి ఇష్టపడతారన్న ప్రశ్నకు నీరజ్ స్పందిస్తూ.. ''సచిన్ తెందుల్కర్ సూపర్ పవర్ కావాలి. దేశానికి ఎన్నో ఏళ్లు ప్రాతినిధ్యం వహించిన అతడు.. అనేక రికార్డులు నెలకొల్పాడు. మేటి బౌలర్ల నుంచి సవాళ్లను అద్భుతంగా ఎదుర్కొన్నాడు. అసాధారణ ప్రదర్శన చేశాడు. ఆ సూపర్ పవర్ నాకు కావాలి. దాంతో నేనూ సచిన్ లాగే రాణించడానికి ప్రయత్నిస్తా. సవాళ్లను ప్రశాంతంగా ఎదుర్కోవడానికి ఆ పవర్ నాకు ఉపయోగపడుతుంది'' అని అన్నాడు. ఏ క్రికెటర్ జావెలిన్ విసరగలడని భావిస్తున్నారన్న ప్రశ్నకు.. బ్రెట్ లీ అని బదులిచ్చాడు నీరజ్. ''బ్రెట్ లీ జావెలిన్ త్రోయర్ అని విన్నా. అతడు బాగా విసరగలడు. బుమ్రా విసిరితే చూడాలనుంది. అతడు నాకు కొన్ని బౌలింగ్ మెళకువలు నేర్పిస్తాడని కూడా ఆశిస్తున్నా. బౌలింగ్, జావెలిన్.. రెండూ త్రోలే అయినా భిన్నమైనవి. బుమ్రా నుంచి నేర్చుకోవాలనుకుంటున్నా'' అని నీరజ్ చెప్పాడు. నీరజ్ ఈ నెల 5న బెంగళూరులో ఎన్‌సీ క్లాసిక్ ఈవెంట్లో పోటీపడతాడు.



# రెండో టెస్ట్‌లో బుమ్రా స్థానంలో ఆకాశ్‌దీప్?!

ఇంగ్లాండ్ పర్యటనలో భాగంగా టీమ్ఇండియా బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో జులై 2 నుంచి రెండో టెస్ట్ మ్యాచ్ ఆడనుంది. వర్క్‌లోడ్ నేపథ్యంలో బుమ్రా ఈ సిరీస్‌లో కేవలం మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడనున్నాడు. అయితే రెండో టెస్ట్‌లో ఆడతాడా? లేదా? అనే విషయమై ఇంకా అధికారికంగా ఏ ప్రకటనా రాలేదు. రెండో టెస్టు మ్యాచ్‌లో బుమ్రా స్థానంలో ఆకాశ్‌దీప్ ఆడతాడనే వార్తలు వినిపిస్తున్నాయి. దానికి తగ్గట్టుగానే అతడు టీమ్ఇండియా ప్రాక్టీస్ సెషన్‌లో చెమటోడ్చుతూ కనిపించాడు. అతడితో పాటు మహ్మద్ సిరాజ్ , ప్రసిద్ధ్ కృష్ణ కూడా ఎక్కువగా ప్రాక్టీస్ చేశారు. అర్షదీప్ సింగ్ మాత్రం అంతగా ప్రాక్టీస్ చేయలేదు. రెండో మ్యాచ్‌లో అతడు ప్లేయింగ్ ఎ లెవన్‌లో ఉండడని తెలుస్తోంది. ప్రాక్టీస్ సెషన్ సందర్భంగా జస్ప్రీత్ బుమ్రా, కోచ్ గౌతం గంభీర్ మధ్య సుదీర్ఘ సంభాషణలూ జరిగాయి. అయితే బుమ్రా కూడా కాసేపు బౌలింగ్ ప్రాక్టీస్ చేశాడు. ఆకాశ్‌దీప్ ఇంతకుముందు టీమ్ఇండియా తరపున ఏడు టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. చివరిసారిగా డిసెంబర్ 2024లో అతడు ఆస్ట్రేలియాతో బాక్సింగ్ డే టెస్ట్ ఆడాడు. ఇప్పటివరకు అతడు తన టెస్ట్ కెరీర్‌లో 15 వికెట్లు తీసుకున్నాడు. మరోవైపు అర్షదీప్ సింగ్



ఇంత వరకు టెస్ట్‌మ్యాచ్‌లో అరంగేట్రం చేయలేదు. టీ20ల్లో మాత్రం టీమ్ఇండియా తరపున లీడింగ్ వికెట్ టేకర్‌గా ఉన్నాడు.



## మరో టీ20 లీగ్ వేలంలోకి రిషభ్ పంత్.. మరికొంత మంది ఐపీఎల్ స్టార్లు కూడా!

గతేడాది జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో రిషభ్ పంత్ ని లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ భారీ ధరకు దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ వికెట్‌కీపర్ బ్యాటర్‌ని రూ.27 కోట్లు వెచ్చించి సొంతం చేసుకుంది. టోర్నీ చరిత్రలోనే ఇదే అత్యధికం. తాజాగా రిషభ్ పంత్ మరో టీ20 లీగ్ వేలంలోకి వచ్చాడు. ఢిల్లీ ప్రీమియర్ లీగ్ రెండో ఎడిషన్ కోసం జులై 6, 7 తేదీల్లో వేలం నిర్వహించనున్నారు. డీపీఎల్ ఆక్షన్‌లో రిషభ్ పంత్ తన పేరును నమోదు చేసుకున్నాడు. ఈ సారి డీపీఎల్‌లో న్యూ ఔటర్ ఢిల్లీ, న్యూ ఢిల్లీ పేరిట రెండు కొత్త ఫ్రాంఛైజీలు చేరాయి. దీంతో ఫ్రాంఛైజీల సంఖ్య ఎనిమిదికి చేరింది.2024లో జరిగిన డీపీఎల్ తొలి ఎడిషన్ ద్వారా దిగ్వేశ్ రాఠీ, ప్రియాంశ్ ఆర్య వంటి ప్రతిభావంతులు వెలుగులోకి వచ్చారు. అనంతరం ఐపీఎల్ ఫ్రాంఛైజీల దృష్టిని ఆకర్షించారు. ఐపీఎల్ 2025 సీజన్‌లో అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ సారి దిగ్వేశ్, ప్రియాంశ్‌తోపాటు ఐపీఎల్ స్టార్లు ఇషాంత్ శర్మ, ఆయుష్ బదోని, హర్షిత్ రాణా, హిమ్మత్ సింగ్, సుయాశ్ శర్మ, మయాంక్ యాదవ్, అనుజ్ రావత్ డీపీఎల్ వేలం బరిలో నిలిచారు.

**సెహ్వాగ్ తనయులు కూడా!**

మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ ఇద్దరు కుమారులు ఆర్యవీర్ సెహ్వాగ్, వేదాంత్ సెహ్వాగ్ కూడా డీపీఎల్ వేలంలో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. వీరిద్దరూ వేలంలో 'బి' కేటగిరీలో ఉన్నట్లు సమాచారం. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అన్న కుమారుడు ఆర్యవీర్ కోహ్లీ కూడా ఢిల్లీ ప్రీమియర్ లీగ్ వేలంలో ఉంటాడని సమాచారం. విరాట్ చిన్ననాటి కోచ్ రాజ్‌కుమార్ శర్మ దగ్గర ఆర్యవీర్ కోహ్లీ మెళకువలు నేర్చుకుంటున్నాడు.



# ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్.. అగ్రస్థానానికి చేరువలో స్మృతి మంధాన

**దుబాయ్:** టీమ్ఇండియా మహిళల క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టీ20లో శతకం (112) బాదింది. దీంతో టీ20 కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్ పాయింట్ల (771)ను సాధించి అగ్రస్థానానికి చేరువైంది. మంధాన ఒక స్థానం మెరుగై మూడో ప్లేస్‌లో నిలవగా.. ఆస్ట్రేలియా బ్యాటర్ బెత్ మూనీ (794), విండీస్ క్రికెటర్ హేలీ మాథ్యూస్ (774) తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. షెఫాలీ వర్మ ఒక స్థానం మెరుగై 13వ స్థానంలో నిలవగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 12వ స్థానంలో కొనసాగుతోంది. బౌలింగ్ ర్యాంకింగ్స్ విషయానికొస్తే దీప్తి శర్మ, రేణుకా సింగ్ ఒక్కో స్థానం దిగజారి వరుసగా మూడు, ఆరు స్థానాల్లో నిలిచారు. రాధా యాదవ్ 16వ స్థానంలో కొనసాగుతోంది. ఇంగ్లాండ్‌తో మిగిలిన నాలుగు టీ20ల్లో రాణిస్తే మంధాన టాప్‌లోకి దూసుకెళ్లడం ఖాయం. ఇప్పటికే స్మృతి వన్డేల్లో నంబర్ వన్ బ్యాటర్‌గా ఉన్న సంగతి తెలిసిందే. ఇక, నాటింగ్‌హామ్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టీ20లో స్మృతి మంధాన శతకంతో చెలరేగింది. దీంతో భారత్ 210 పరుగుల భారీ స్కోరు చేయగా.. ఇంగ్లాండ్ 113 పరుగులకే కుప్పకూలింది. ఈ సెంచరీతో మూడు ఫార్మాట్లలో శతకాలు చేసిన తొలి భారత మహిళా బ్యాటర్‌గా మంధాన రికార్డు సృష్టించింది. ఇవాళ (జులై 1) బ్రిస్టల్‌లో ఇంగ్లాండ్, భారత్ మధ్య రెండో టీ20 జరగనుంది.



## రెండో టెస్ట్ మ్యాచ్‌లో జైస్వాల్ స్లిప్స్‌లో ఫీల్డింగ్ చేయడు.. ఎందుకో తెలుసా?!

ఇంగ్లాండ్ పర్యటనలో భాగంగా టీమ్ఇండియా రేపటి (జులై 2) నుంచి బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా రెండోటెస్ట్ మ్యాచ్‌లో ఇంగ్లిష్ జట్టుతో తలపడనుంది. భారత యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ ఈ మ్యాచ్‌లో స్లిప్స్‌లో ఫీల్డింగ్ చేయడు. లీడ్స్‌లో జరిగిన మొదటి మ్యాచ్‌లో ఇదే స్థానంలో ఫీల్డింగ్ చేసిన అతడు ఏకంగా నాలుగు క్యాచ్‌లను వదిలేశాడు. అవి టీమ్ఇండియా విజయావకాశాలను దెబ్బ తీశాయి.

అయితే రెండో టెస్ట్ మ్యాచ్‌కు ముందు ప్రాక్టీస్ సెషన్‌లో స్లిప్ ఫీల్డింగ్‌లో జైస్వాల్ కనిపించలేదు. కరుణ్ నాయర్, శుభ్‌మన్ గిల్ , కేఎల్ రాహుల్ మాత్రమే స్లిప్స్‌లో క్యాచ్‌లు ప్రాక్టీస్ చేశారు. జైస్వాల్ మాత్రం.. టీమ్ఇండియా అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే సమక్షంలో షార్ట్‌లెగ్, లెగ్ స్లిప్ పొజిషన్స్‌లో ఫీల్డింగ్ ప్రాక్టీస్ చేశాడు. టీమ్ఇండియా ఫీల్డర్లు మొదటి టెస్ట్ మ్యాచ్‌లో చాలా క్యాచ్‌లు నేలపాలు చేశారు. ఈ అవకాశాల్ని సద్వినియోగం చేసుకున్న ఇంగ్లాండ్ బ్యాటర్లు భారీ స్కోర్లు సాధించి, టీమ్ఇండియాకు విజయాన్ని దూరం చేశారు. ముఖ్యంగా యశస్వి జైస్వాల్ నాలుగు క్యాచ్‌లను డ్రాప్ చేశాడు. అందులో మూడు.. బుమ్రా బౌలింగ్‌లో వచ్చిన క్యాచ్‌లే కావడం గమనార్హం.

ఇదే విషయమై టీమ్ఇండియా అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే విలేకరులతో మాట్లాడాడు. జైస్వాల్‌ను స్లిప్ ఫీల్డింగ్ బాధ్యతల నుంచి తప్పించిన విషయం నిజమే అని ధ్రువీకరించాడు. అతడిలో ఆత్మవిశ్వాసం సన్నగిల్లకుండా ఉండటం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించాడు. 'యశస్వి జైస్వాల్‌లో తిరిగి ఆత్మవిశ్వాసం పెంపొందించడం కోసమే మేం ఈ నిర్ణయం తీసుకున్నాం. అతడు కొంతకాలం స్లిప్స్‌లో ఫీల్డింగ్ చేయడు. నిజానికి యశస్వి జైస్వాల్ మంచి ఫీల్డర్. ఇంతకు ముందు చాలా మంచి క్యాచ్‌లు అందుకున్నాడు' అని ర్యాన్ టెన్ డస్కాటే వివరించాడు.



## తనపై వచ్చిన మీమ్స్‌పై మౌనం వీడిన కావ్య మారన్

అభిమానులు ఎక్కువగా ఫాలో అయ్యే జట్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఒకటి. ఈ టీమ్‌లో ట్రావిస్ హెడ్ , పాట్ కమ్మిన్స్ , హెన్రిచ్ క్లాసెన్ వంటి మేటి ఆటగాళ్లున్నారు. ఈ ఫ్రాంఛైజీ సహ యజమాని కావ్యమారన్ ఐపీఎల్‌లో తమ జట్టు ఆడినప్పడల్లా ఆటగాళ్లను ఉత్సాహపరుస్తూ తరచుగా స్టాండ్లలో కనిపిస్తారు. కొన్ని సందర్భాల్లో, ఆమె డ్రెస్సింగ్ రూమ్‌లో ఉత్సాహభరితమైన ప్రసంగాలు కూడా ఇస్తుంటారు. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో కూడా ఆమెపై ఎక్కువగా మీమ్స్ వస్తూ ఉంటాయి.

క్రికెట్ మీద తనకున్న మక్కువ వల్లే తాను ఎక్కువగా కెమెరామెన్ దృష్టిలో పడుతుంటానని కావ్య మారన్ అంటున్నారు. ఇదే తనపై మీమ్స్ ఎక్కువగా రావడానికి కారణమై ఉంటుందని వివరించారు. 'సన్‌రైజర్స్ జట్టు హైదరాబాద్‌లో ఆడినప్పుడే కాదు, అహ్మదాబాద్, చెన్నై లాంటి ప్రాంతాలకు కూడా నేను టీమ్‌ను ఉత్సాహపరచడానికి వెళుతుంటాను. నేను ఎక్కడో చాలా దూరంలో కూర్చున్నా.. కెమెరామెన్ నా హావభావాలను బంధిస్తాడు. అందుకే అవి మీమ్స్‌గా మారుతున్నాయి' అని ఆమె ఒక ఇంటర్వ్యూలో చెప్పారు.

సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు చివరిసారిగా 2016లో ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకోగలిగింది. 2018, 2024లో రెండుసార్లు మాత్రమే ఫైనల్‌కు చేరుకుంది. 2025 సీజన్‌లో ఆ జట్టు పేలవ ప్రదర్శన చేసింది.